
కోనసీమ అందాలు..


కడియం నర్సరీలు


కోర్డెలియా షిప్ క్రూయిజ్

ప్రగతి పీఠిక..

విశాల సముద్ర తీరం.. పోర్టులు.. నర్సరీలు.. కొబ్బరి.. అరటి.. పామాయిల్.. పౌల్ట్రీ.. గ్యాస్ నిక్షేపాలు.. అబ్బురపరిచే పర్యాటక అందాలు.. ఇలా ఒకటేంటి ఉమ్మడి తూ.గో. జిల్లాలో అపార వనరులు ఎన్నో.. వీటిని మరింత సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధిలో ఆకాశమంత ఎత్తుకు ఎదగడానికి ఎన్నో అవకాశాలున్నాయి. తద్వారా ప్రజల ఆదాయం అమాంతం పెంచి అభివృద్ధి పథంలో నడిపించేందుకు మార్గాలున్నాయి. ఇప్పుడు సీఎం చంద్రబాబు దీనిపైనే దృష్టిసారించారు. కొత్తగా విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను సృష్టించి అందులో ఉమ్మడి తూ.గో.ని చేర్చారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో వేటికవే ప్రత్యేకతలున్నందున ఆయా అంశాల్లో ఈ మూడు జిల్లాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రత్యేక విజన్ ప్లాన్ తయారుచేశారు. 2032 నాటికి ఈ మూడు జిల్లాల్లో సమూల మార్పులు వచ్చేలా ప్రణాళికలు తయారు చేశారు.

అభివృద్ధి సూచిక!

- విశాఖ ఎకనమిక్ రీజియన్ విజన్ ప్రణాళికలో ఉమ్మడి జిల్లాకు పట్టం
- కాకినాడ, కోనసీమ, తూ.గో. జిల్లాల్లో భారీ అభివృద్ధి ప్రణాళికలు
- కాకినాడలో 2 వేల ఎకరాల్లో ఆక్వా పార్కు.. కేజీ బేసిన్‌లో ఉత్పత్తి రెట్టింపు
- కడియం నర్సరీలను దేశ నర్సరీ రాజధానిగా మార్చేలా ప్రతిపాదనలు
- 2 వేల ఎకరాల్లో పాలీహౌస్‌లు, టిస్యూ కల్చర్ ల్యాబ్‌లు, రోబోటిక్ గార్డెన్
- సినిమా షూటింగ్‌లు, రివర్ క్రూయిజ్ ప్రోత్సహిస్తే కోనసీమకు మహర్దశ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ.. ప్రగతి జాడ..

7.4 బిలియన్ డాలర్ల జీడీడీపీతో 2.2 మిలియన్ జనాభా ఉన్న కాకినాడ జిల్లాలో సుదీర్ఘ సముద్ర తీరం.. ఓడరేవు, పరిశ్రమలకు నెలవు. ఈ జిల్లాను ఆయా రంగాల్లో మరింత ఎత్తుకు తీసుకువెళ్లేలా విశాఖ ఎకనమిక్ రీజియన్ ప్రణాళికలో ప్రస్తావించారు. ఇందులోభాగంగా 200ఎకరాల్లో తీర ప్రాంతంలో ప్రభుత్వం ఆక్వా పార్కును ప్రభుత్వం ప్రతిపాదించింది. అలాగే ఇక్కడ త్వరలో 1 ఎంఎంటీపీఏ గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటుకాబోతోంది. అలాగే 2 గిగావాట్ల ఎలక్ట్రొలైజర్ ఉత్పత్తి చేయబోతున్నారు. తద్వారా కాకినాడ అభివృద్ధి చెందడంతోపాటు ఇక్కడ తయారయ్యే గ్రీన్ అమ్మోనియాలో 0.25 మిలియన్ మెట్రిక్ టన్నులు విదేశాలకు ఎగుమతి చేయవచ్చు. ఇక్కడున్న కేజీ బేసిన్ దేశంలో 35 శాతం గ్యాస్ అవసరాలు తీర్చుతోంది. లక్షల కోట్లు టర్నోవర్ జరిగే బేసిన్‌లో మున్ముందు గ్యాస్, చమురు అన్వేషణ పెంచి కొత్త బ్లాక్‌లు తవ్విస్తే రీజియన్ ఆర్థికంగా మరింత బలోపేతమవుతుంది. అలాగే కాకినాడ నుంచి శ్రీకాకుళం వరకు గ్యాస్ పైపులైన్ నిర్మాణం ఇప్పటికీ జరగలేదు. 20-30 ఎంఎంఎస్‌సీఎంఈ సామర్థ్యంతో దీన్ని వచ్చే ఏడాదిలోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రచించారు. ఇందుకు 100 నుంచి 150 మిలియన్ డాలర్లు అవసరమని అంచనా. తద్వారా ఇంటింటి గ్యాస్ అవసరాలను రీజియన్ మొత్తానికి తీర్చవచ్చు. అలాగే కాకినాడలో ప్రత్యేక గ్యాస్ టెర్మినల్ నిర్మించాలని ప్రతిపాదించింది. 20-30 ఎంఎంఎస్‌సీఎండీ సామర్థ్యంతో 2028-2030కి దీన్ని పూర్తి చేయాలని పేర్కొంది. ఈ రీగ్యాసిఫికేషన్ యూనిట్‌కు 900 మిలియన్ నుంచి 1 బిలియన్ ప్రైవేటు పెట్టుబడులు అవసరమని పేర్కొంది. అలాగే ప్రస్తుతం కాకినాడ డీప్‌వాటర్ పోర్టు 26 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో (ఎంఎంటీపీఏ) సామర్థ్యంతో పనిచేస్తోందని, 2032 నాటికి 63 ఎంఎంటీపీఏకు సామర్థ్యం పెంచాలని పేర్కొంది. అలాగే ఇక్కడున్న ప్రభుత్వ యాంకరేజ్ పోర్టు సామర్థ్యం 4 నుంచి 5కి, రాబోతున్న గేట్‌వే పోర్టు సామర్థ్యం 16 ఎంఎంటీపీఏకు పెంచాల్సి ఉందని గుర్తించింది. అలాగే కాకినాడలో నౌకల తయారీ రంగం అంతంత మాత్రంగానే ఉందని నివేదిక పేర్కొంది. ఓ ప్రైవేటు యార్డు ద్వారా ఏటా 4 వేల నుంచి 5వేల గ్రాస్ టన్నుల తయారీ జరుగుతోందని, వసతులు పెంచి అదనంగా పది వేల గ్రాస్ టన్నుల తయారీ పెంచాలని ప్రతిపాదించింది. అలాగే జిల్లాలో ప్రైవేటు రంగంలో 5,600 ఎకరాల్లో మల్టీప్రొడక్ట్ పార్క్ ఏర్పాటుచేయాలని ప్రణాళిక సిద్ధంచేసింది. బుద్ధిస్ట్, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని పరుగులు తీసేలా పలు సూచనలు చేసింది. ఏటా అన్నవరం దేవాలయానికి 1 మిలియన్, ద్రాక్షారామ 0.2 మిలియన్, పిఠాపురం 0.1 మిలియన్ భక్తులు వస్తున్నారని, ఇది భారీగా పెరిగేలా సన్నద్ధం చేయాలని పేర్కొంది. భవిష్యత్తు అవసరాల్లో భాగంగా పారిశ్రామిక రంగంలో పనిచేసే వారి అవసరాలకు 1,500 ఎకరాల్లో క్లీన్ టెక్ మాన్యుఫ్యాక్చరింగ్ సిటీ ప్రతిపాదించారు. అలాగే కాకినాడ-మూలపేట బైపాస్ రోడ్డు, విశాఖ-కాకినాడ 125 కి.మి. కోస్టల్ రోడ్డు ద్వారా అన్ని పోర్టులకు అనుసంధానం పెంచి కార్గో రవాణా భారీగా పెంచాలని వ్యూహం రచించారు.

తూ.గో.. నర్సరీల రాజధానిగా..

విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో అత్యధిక జీవీఏ ఉత్పత్తితో తూర్పుగోదావరి జిల్లా ఉంది. 2024 ఆర్థిక సంవత్సరానికిగాను 2.4 బిలియన్ జీవీఏ నమోదుచేసింది. కాకినాడ జిల్లా 2.2 బిలియన్, కోనసీమ 1.9 బిలియన్‌గా ఉంది. వార్షిక జీడీడీపీ 6.8 బిలియన్లతో రెండు మిలియన్ల జనాభా ఉన్న ఈ జిల్లా గుడ్లు, నర్సరీ కేంద్రంగా కొనసాగుతున్నట్టు నివేదిక గుర్తించింది. భవిష్యత్తులో ఇక్కడ ఐసీఏఆర్ లేదా సీఏఆర్ఐ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. కోళ్ల రకరకాల వ్యాధులు తట్టుకునేలా ఈ పరిశోధన కేంద్రం అడుగులు వేయాలని సూచించింది. అలాగే క్రూడ్ పామాయిల్ ఉత్పత్తిలో ఈ జిల్లా 15 శాతం, కాకినాడ 9 శాతంతో టాప్‌లో ఉన్నాయని వివరించింది. భవిష్యత్తులో ఈ ఉత్పత్తి పెరిగితే మరింత ఆదాయం వస్తుందని సూచించింది. అరటి ఉత్పత్తి కూడా ఈ జిల్లాలో అధికంగా ఉన్న నేపథ్యంలో కొవ్వూరులో హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదించింది. నర్సరీ సాగులో ఈ జిల్లా లీడర్‌గా ఉందని దేశ నర్సరీల రంగానికి ఈ ప్రాంతం రాజధాని కానుందని విశ్లేషించింది. 5,500 హెక్టార్లలో సాగవుతున్న నర్సరీల ద్వారా ఏటా 100 మిలియన్ డాలర్ల జీవీఏ వస్తుండగా, 50వేల మందికి ఉపాధి లభిస్తోంది. కానీ ఎగుమతులు 2 శాతం లోపే ఉన్నాయని, 2032 నాటికి ఎగుమతులు 15 శాతం పెంచడానికి ఆస్కారం ఉందని తెలిపింది. ఆర్నమెంటల్, అవెన్యూ మొక్కల ఎగుమతికి ఆస్కారం ఉందని తెలిపింది. నర్సరీల్లో ఆధునిక పద్ధతులు వాడి జీవీఏను 2032 నాటికి 200 మిలియన్ డాలర్లకు పెంచే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొంది. అంటే సాగు 40 శాతం పెరగాలని తెలిపింది. 15 శాతం ఎగుమతులు పెంచితే 120మిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతుందని విజన్ ప్రణాళికలో తెలిపింది. ఇందుకోసం 2వేల ఎకరాల్లో నర్సరీ జోన్‌లు ఏర్పాటుకు ప్రతిపాదించింది. పాలీహౌస్‌లు, టిష్యూ కల్చర్ ల్యాబ్‌లు, రోబోటిక్ గార్డెన్‌తోపాటు శీతల గిడ్డంగుల వసతి కల్పించాల్సి ఉందని తెలిపింది. అలాగే పర్యాటక రంగం మరింత ఎదగడానికి ఈ జిల్లాకు చాలా అవకాశాలున్నాయని, పర్యాటకుల కోసం 6 నుంచి 12 గంటల వ్యవధిలో లాంగ్ హాప్-ఆన్ హాప్-ఆఫ్ రివర్ క్రూయిజ్ పర్యాటకం ప్రోత్సహించాలని పేర్కొంది. రాజమండ్రి-భద్రాచలం, కాకినాడ-దిండి మార్గాల్లో టర్కీ మోడల్ క్రూయిజ్ నడపాలని ప్రతిపాదించింది. భద్రాచలం-రాజమండ్రి లోకల్ సైట్ సీయింగ్, కాకినాడ-దిండి బ్యాక్ వాటర్ లీజర్ క్రూయిజ్‌లు నడపాలని సూచించింది. అలాగే భవిష్యత్తులో ద్రాక్షారామ, పిఠాపురంలో 250 చొప్పున హోటల్ గదులు, అన్నవరం 500 గదులు రావాలని ప్రతిపాదించింది. ఏటా జూలైలో గోదావరి యాత్ర ఏడు రోజులు, నవంబరులో ఏడు రోజులు కాకినాడ బీచ్ ఫెస్టివల్ నిర్వహించాలని తెలిపింది.


కొబ్బరి కేంద్రం.. కోనసీమ

కొబ్బరి పంటకు కేంద్రంగా కోనసీమ జిల్లా ఉందని నివేదికలో నీతిఆయోగ్ వెల్లడించింది. 5.1 బిలియన్ జీడీడీపీతో 1.8మిలియన్ జనాభా ఉన్న జిల్లా ప్రకృతి అందాలకు, గోదావరి, సముద్రం బ్యాక్ వాటర్స్‌కు పెట్టింది పేరని తెలిపింది. ఈ నేపథ్యంలో సినిమా చిత్రీకరణలకు రాజధానిగా జిల్లాను మార్చాలని ప్రతిపాదించింది. సముద్రంలో నాచు పెంపకంతో ఇక్కడ భారీగా ఆదాయం రాబట్టవచ్చని తెలిపింది. కోనసీమలో కోకోనట్ రీసెర్చ్ స్టేషన్ సామర్థ్యం పెంచాలని సూచించింది.

పెట్టుబడులతో రండి!

- కాకినాడలో నాఫ్తాకాంప్లెక్స్, పాలిమర్స్ యూనిట్ ఏర్పాటు చేయండి
- ఎల్‌జీ కెమికల్స్ కంపెనీతో చర్చించిన సీఎం
- షిప్ క్రూయిజ్ సర్వీసులపై కోర్డెలియాతో సంప్రదింపులు

కాకినాడలో నాప్తా కాంప్లెక్స్ పాలిమర్స్ కంపెనీ ఏర్పాటుచేయడానికి ముందుకు రావాలని ఎల్‌జీ కెమికల్స్ కంపెనీని సీఎం చంద్రబాబు కోరారు. రెండో రోజు విశాఖలో పెట్టుబడుల సదస్సులో భాగంగా సీఎం ఎల్‌జీ కెమికల్స్ కంపెనీతో చర్చలు జరిపారు. యు.కొత్తపల్లి మండలం మూలపేటలో ఈ రెండింటిని ఏర్పాటు చేసే విషయమై పరిశీలించాలని కోరారు. ప్లాస్టిక్ రీసైకింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే అందుకు తగ్గ సహాయసహకారాలు అందిస్తామని వివరించారు. జేఎస్‌డబ్ల్యూ కంపెనీతో కలిసి ఎల్జీ కెమికల్ సంస్థ ఏర్పాటు చేయదలచిన కాథోడ్ యాక్టివ్ మెటీరియల్ తయారీ యూనిట్‌కు సైతం సహకారం అందిస్తామని పేర్కొన్నారు. వాస్తవానికి అనేక రకాల పరిశ్రమలు నిర్వహించడానికి ఇంధనంగా గ్యాస్ అవసరం. అది అందుబాటులో లేనప్పుడు నాప్తాతోను పరిశ్రమలను నడిపించవచ్చు. ఒకవేళ ఎల్‌జీ కంపెనీ నాప్తా కాంప్లెక్స్ ఏర్పాటుకు సానుకూలంగా స్పందిస్తే రూ.60వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అంచనా. కొరియా దేశానికి చెందిన ఎల్‌జీ కెమికల్స్‌కు పలు దేశాల్లో ఇప్పటికే నాప్తా కాంప్లెక్స్‌లు ఉన్నాయి. మరోపక్క దేశంలో ముంబై, గోవా తదితర ప్రాంతాల్లో సముద్రంలో షిప్ క్రూయిజ్ నిర్వహణలో ప్రఖ్యాతి గాంచిన కోర్డెలియా క్రూయిజ్ కంపెనీ ప్రతినిధులతో సీఎం చర్చలు జరిపారు. కాకినాడ నుంచి విశాఖ-భీమిలికి షిప్ క్రూయిజ్ సర్వీసులు నడపడానికి కలిసిరావాలని కోరారు. కాకినాడ, విశాఖల్లో క్రూయిజ్ టెర్మినల్ సౌకర్యాలు, బీచ్ టూరిజం, వాటర్ అడ్వంచర్ క్రీడల నిర్వహణపై ఆసక్తి చూపుతోంది.



విషాద వీచికలు!

నేడు రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం

సాఫీగా సాగిపోయే ప్రయాణంలో పెనుతుఫాన్.. రోడ్డు ప్రమాదం. రెప్పపాటులో జరిగిపోయే ఈ ఘోరం.. క్షణాల్లో కుటుంబాన్ని రోడ్డున పడేస్తుంది. ఏదైనా ప్రమాదంలో ఇంటి యజమానిని కోల్పోతే.. ఆ కుటుంబం చీకట్లోకి చేజారిపోతుంది. ఆర్థికంగా నిట్టనిలువునా చితికిపోతుంది. కొన్నాళ్లకు.. కూడదీసుకుని నిలబడొచ్చు.. లేదా మరింత అంధకారంలోకి దిగబడిపోవచ్చు. లేదా కుటుంబంలో వేరెవరైనా మరణించినా జీవితాంతం వారు లేని వ్యథ వెంటాడుతుంది. కాలం.. వారిని జీవచ్ఛవాల్లా మార్చేస్తుంది. ఈరోజు రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం. ప్రమాదంలో మరణించిన వారి కన్నీటి కథల్లో ఇవి కొన్ని.. 7

సత్యదేవుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు

- ఒక్కరోజే సుమారు 12 వేల వ్రతాలు
- లక్ష మార్కు దాటిన సత్యదేవుడి కార్తీకం వ్రతాలు 7

జిల్లాలో రూర్బన్ పంచాయతీలు 31

- రాజమహేంద్రవరం డివిజన్‌లో 20
- కొవ్వూరు డివిజన్‌లో 11
- కార్పొరేషన్‌లో విలీనమయ్యే వాటిని కూడా ప్రతిపాదించారు
- వాటి సంగతేంటో..
- మొత్తం పంచాయతీలు 299
- ఇక పీడీవోలుగా సెక్రటరీలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఏడాదికి రూ.కోటి కంటే ఎక్కువ ఆదాయం ఉండే పంచాయతీలను రూర్బన్ పంచాయతీలుగా మార్చారు. అయితే గెజిట్‌లో వీటిని ప్రకటించవలసి ఉంది. ఈ నవంబరు నెలలోనే అధికారిక ప్రకటన రావొచ్చు. జిల్లాలో మొత్తం 299 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో రాజమహేంద్రవరం డివిజన్‌లో 20, కొవ్వూరు డివిజన్‌లో 11 పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా అంటే, రూర్బన్ పంచాయతీలుగా ప్రతిపాదించారు. ప్రభుత్వం రూ.కోటి ఆదాయం దాటిన అన్నింటిని ప్రతిపాదించమని చెప్పడంతో జిల్లాలో రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో అనపర్తి, బలభద్రపురం, బిక్కవోలు, గోకవరం, వేమగిరి, కడియపులంక, కడియం, కోరుకొండ, దివాన్‌చెరువు, పాలచర్ల, రంగంపేట, కోలమూరు, ధవళేశ్వరం, హుకుంపేట, బొమ్మూరు, పిడింగొయ్యి, కాతేరు, రాజవోలు, శాటిలైట్‌సిటీ, కొవ్వూరు డివిజన్ పరిధిలో చాగల్లు, దేవరపల్లి, గోపాలపురం, పంగిడి, నల్లజర్ల, పోతవరం, సమిశ్రగూడెం, ఖండవల్లి, పాలంగి, వేలివెన్ను, ఉండ్రాజవరం గ్రామ పంచాయతీలను ప్రతిపాదించారు. కానీ వీటిలో కొన్ని మాత్రమే అనుమతి పొందే అవకాశం ఉంది. ముఖ్యంగా రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిధిని గ్రామాలను మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విలీన ప్రక్రియ ఉంది. కానీ ఇక్కడ వాటిని కూడా రూర్బన్ పంచాయతీలుగా అధికారులు ప్రతిపాదించారు. విలీన ప్రక్రియకు లేకపోతే అవి రూర్బన్ పంచాయతీలుగా ఉండే అవకాశం ఉంది. రాజమహేంద్రవరం నగరాన్ని మహానగరంగా తీర్చిదిద్దే నేపథ్యంలో ఈ గ్రామాలన్నీ విలీనం అవ్వాలనే ఆలోచన కూడా ఉంది. వీటితోపాటు రాజానగరం మండలంలోని కొన్ని పంచాయతీలు, కోరుకొండ మండలంలోని కొన్ని పంచాయతీలు, కడియం మండలంలోని వేమగిరితో కలిపి మహానగరం చేస్తే, చారిత్రక నగరం మరింత అభివృద్ధి దిశగా పయనిస్తుంది. వీటిపై ఇంకా స్పష్టత రావలసి ఉంది.

పంచాయతీల ప్రక్షాళన...

గ్రామ పంచాయతీల విధానాన్ని ప్రభుత్వం ప్రక్షాళన చేసింది. ప్రతీ గ్రామం ఒక పంచాయతీగా ఉంటుంది. గతంలో రెండు మూడు పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌గా పిలిచేవారు. ఇక ఏ పంచాయతీకి ఆ పంచాయతీనే ప్రత్యేక గుర్తింపుతో ఉంటుంది. అంతేకాక పంచాయతీ సెక్రటరీలను ఇక నుంచి పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (పీడీవో)లుగా మార్చిన సంగతి తెలిసిందే. అంతేకాక గ్రామ పంచాయతీల జనాభా, ఆదాయాన్ని అనుసరించి నాలుగు కేటగిరీలుగా విభజించారు. పెద్ద పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలు (రూర్బన్ పంచాయతీ)లుగా మార్చి, తర్వాత ఆదాయాన్ని జనాభాను బట్టి గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 పంచాయతీలుగా వర్గీకరించారు. జిల్లాలో మొత్తం 299 పంచాయతీలు ఉండగా, అందులో 26 పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ (రూర్బన్) పంచాయతీలుగా గుర్తించారు. ఇవి గ్రామీణ, అర్బన్ ప్రాంతాల రెండింటి పోలికలతో ఉంటాయి. వీటికి డిప్యూటీ ఎంపీడీవో స్థాయి అధికారి ఉంటారు. మున్సిపాల్టీలు, నగర పంచాయతీల మాదిరిగా ఇక్కడ కూడా ప్రణాళిక, ఇంజనీరింగ్, వాటర్ సప్లయ్, శానిటేషన్, రెవెన్యూ వంటి విభాగాలు ఉంటాయి. అందుకే వీటిని రూర్బన్ పంచాయతీలు అంటారు. ఇవి పట్టణాలుగా రూపొందుతున్న పంచాయతీలు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 6,24,412 మంది జనాభా ఉన్నారు. 2021 లెక్కల ప్రకారం రాజమహేంద్రవరం డివిజన్‌లో కడియం, రంగంపేట, రాజానగరం, సీతానగరం, గోకవరం, బిక్కవోలు, అనపర్తి, కోరుకొండ, రాజమండ్రి రూరల్ మండలాల పరిధిలోని పంచాయతీల పరిధిలో 7,49,122 మంది జనాభా ఉన్నారు. ఈ మండలాల పరిధిలోని ఏడాది ఆదాయం రూ.60,82,89,533. ఈ లెక్కల ప్రకారం వాస్తవానికి జిల్లా నుంచి రాజమహేంద్రవరం డివిజన్ నుంచి జిల్లా యంత్రాంగం 20 పంచాయతీలను స్పెషల్ గ్రేడ్‌గానూ, 42 గ్రేడ్-1గానూ, 64 గ్రేడ్-2గానూ, 21 గ్రేడ్-3గానూ ప్రతిపాదించారు. ఈ డివిజన్‌లో మొత్తం 246 పంచాయతీలు ఉన్నాయి. కొవ్వూరు డివిజన్‌లో జనాభా 6,24,412 మంది. ఇక ఈ డివిజన్‌లోని పంచాయతీల వార్షికాదాయం రూ.30,97,60,376. వీటి ఆధారంగా జిల్లా అధికారులు ఈ డివిజన్ నుంచి 11 స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగానూ, 48 గ్రేడ్-1గానూ, 55 గ్రేడ్-2గానూ, 39 గ్రేడ్-3గానూ గుర్తించి ప్రతిపాదించారు. ఈ డివిజన్‌లో మొత్తం 153 పంచాయతీలు ఉన్నాయి. ఇలా జిల్లాలో మొత్తం 299 పంచాయతీలు ఉండగా వీటి జనాభా మొత్తం. 13 లక్షల,73వేల534మంది, ఈ పంచాయతీల మొత్తం వార్షికాదాయం రూ.91,80,49,908. ఈ లెక్కల ప్రకారం స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా 31, గ్రేడ్-1 పంచాయతీలుగా 89, గ్రేడ్-2 పంచాయతీలుగా 119, గ్రేడ్-3 పంచాయతీలుగా 60ను విభజించి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. కానీ వీటిలో కొన్ని మార్పులు జరుగుతున్నట్టు సమాచారం. త్వరలో స్పష్టత రానుంది.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం : జేసీ

దివాన్‌చెరువు, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులపై నిత్య ఒత్తిడిని తగ్గించేందుకు, వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపేందుకు కార్తీక వనసమారాధన ఎంతో దోహదం చేస్తుందని జేసీ వై.మేఘస్వరూప్ అన్నారు. లాలాచెరువు సమీపంలోని గోదావరి మహాపుష్కర వనంలో జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా అధికారుల కార్తీక వనమహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి హాజరైన జాయింట్ కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ అన్ని విభాగాల అధికార్లు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనడం ఆనందదాయకమని తెలిపారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జేసీ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా అటవీ అధికారి వి.ప్రభాకరరావు మాట్లాడుతూ అటవీశాఖ అధికార్లు, సిబ్బంది కృషి ఫలితంగానే ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు. తొలుత ఉసిరిచెట్టు కింద పూజలు చేశారు. అనంతరం జేసీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, జిల్లా గృహనిర్మాణ సంస్థ పీడీ నాతిబుజ్జి, కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీ ఎస్.భాస్కర్‌రెడ్డి, సీపీవో ఎల్.అప్పలకొండ, జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.మాధవరావు, జిల్లా అధికారిణిలుఎస్.సుభాషిణి, వి.శాంతామణి, పి.వీణాదేవి పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న జాయింట్ కలెక్టర్ మేఘస్వరూప్


నృత్య ప్రదర్శనలు



అలరించిన గిరిజన నృత్య ప్రదర్శనలు

ముగిసిన భగవాన్ బిర్సాముండా 150వ జయంతి ఉత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్ నవంబరు 15(ఆంధ్రజ్యోతి): భగవాన్ బిర్సాముండా 150 జయంతి వేడుకలు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందరేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జాయింట్ కలెక్టర్ మేఘస్వరూప్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులు, బాలికల వసతి గృహం-1,2 విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి, గిరిజన సంప్రదాయ నృత్యాలు, గీతాలు, కళారూపాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో భాగంగా 15 రోజులపాటు వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వ్యక్తిత్వ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం పీఎంఎస్ బాలికల వసతిగృహం-2 విద్యార్థినుల మా గూడెం దింసా నృత్యం, బొమ్మూరు గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల చెంచుబుడ్డి, తూర్పుకొండల సూర్యుడు అంటూ ఆలపించిన పాటలు, రాజమహేంద్రవరం పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతి గృహం విద్యార్థినుల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల గిరిజన సంప్రదాయ వస్త్ర ధారణలతో ఫ్యాషన్‌షో, ర్యాంప్‌వాక్ కార్యక్రమాలు శ్రోతలను అమితంగా అలరించాయి. గిరిజన విద్యార్థినుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద వేదికగా నిలుస్తున్నాయని ఎంపీ పురందరేశ్వరి పేర్కొన్నారు.

విషాద వీచికలు..



నేడు రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం

- ఏటా భారీగా రోడ్డు ప్రమాదాలు
- వందల సంఖ్యలో మృతులు.. క్షతగాత్రుల గణాంకాలు
- ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలేంటి?
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- అనాథలుగా మారుతున్న పిల్లలు
- హైవేలపై భారీగా బ్లాక్ స్పాట్స్
- రహదారులపై భద్రత ప్రశ్నార్థకం

చీకటి తర్వాత వెలుగు వస్తుందనేది ఓ ఆశ. ఈరోజు ముగిస్తే రేపు ఉందనేది ఓ భరోసా. అదేవిధంగా ప్రతి మనిషి జీవితంలో వెలుగునీడలు సర్వసాధారణం. ప్రతి కుటుంబంలో కష్టసుఖాలు అంతే సహజం. అయితే ఆశకు, నిరాశకు మధ్య బలమైన నమ్మకమో, విశ్వాసమో భవిష్యత్‌కు దారి చూపిస్తుంది. అదే అందరికీ ఆలంబన. కానీ.. ఒకే ఒక్క ఘటన.. ఓ కుటుంబం పెంచుకున్న ఆశలను తుంచివేస్తుంది. రేపనేది ఏమిటో అర్థం కాని అంధకారంలోకి నెట్టివేస్తుంది. కొందరి జీవితాల్లో చీకటి తర్వాత మళ్లీ వచ్చేది చీకటే. కళ్ల ముందు ఉన్న ఆప్తులు అర్ధాంతరంగా మాయమైపోతే.. దుఃఖం కట్టలు తెంచుకుని ఉప్పెనలా చుట్టేస్తుంది. కానీ కొన్నాళ్లకు దుఃఖాశ్రువులు ఇంకిపోవచ్చుగానీ.. అయినవారిని కోల్పోయిన వారికి ఏళ్ల తరబడి విషాద వీచికలు చిగురుటాకులా వణికిస్తూనే ఉంటాయి. ఇవి రోడ్డు ప్రమాద స్మృతులు.. నిద్రలో ఉలిక్కిపడి లేపే పీడ కలలు..

(కాకినాడ/రాజమహేంద్రవరం/(ముమ్మిడివరం-ఆంధ్రజ్యోతి)

రోడ్డు ప్రమాదాలు జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నాయి. చాలా కుటుంబాలను చిందర వందర చేస్తున్నాయి.అతివేగం, నిర్లక్ష్యం, నిద్రమత్తు, మద్యం సేవించడం..ఇలా కారణం ఏదైనా ఒక్క ప్రమాదంతో అనేకమంది రోడ్డునపడుతున్నారు. చిన్నారులు అనాథలవుతున్నారు.

తాళ్లరేవు మండలంలో ఈ ఏడాది జూలైలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఓ ఆటోను వేగంగా ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు మృతి చెందడంతో బాధిత కుటుంబంలో ఇద్దరు బాలలను అనాథలను చేసింది. ఓ కుటుంబానికి పెద్ద దిక్కును లేకుండా చేసింది. ఓ మహిళను లేవలేని జీవచ్ఛవంలా మార్చింది. మంచానికే పరిమితం చేసింది. నాలుగు ఆపరేషన్లు, కాళ్లు, చేతుల్లో స్టీల్ రాడ్‌లతో ఆమె నరకం అనుభవిస్తూ.. నడవలేని స్థితిలో ఆ మహిళ ఉంది. వీరికి ప్రమాదానికి కారణమైన ట్రావెల్స్‌యాజమాన్యం నుంచికానీ.. ప్రభుత్వంనుంచి గానీ సాయం అందలేదు. అనేక ప్రమాద ఘటనల్లో ఇదే పరిస్థితి.



రంగంపేట మండలం వడిశలేరు వద్ద లారీని వెనుక నుంచి ఢీకొని నుజునుజ్జయిన కారు

కుటుంబాలను చీకట్లోకి నెట్టి..

రోడ్డు ప్రమాదాలు కొందరి జీవితాలను అంధకారంలోకి నెడుతున్నాయి. కొన్ని ప్రమాదాల్లో కుటుంబాలను పోషించే పెద్ద దిక్కులు మృత్యువాత పడడంతో కుటుంబాలు రోడ్డునపడుతున్నాయి. యువకులు సైతం ప్రమాదాలబారిన పడి కుటుంబాలను శోకసంద్రంలో ముంచుతున్నారు. మద్యం మత్తు, నిర్లక్ష్యంతో వాహనాలను ఇష్టానుసారంగా నడుపుతూ తల్లిదండ్రులకు కన్నీళ్లు మిగులుస్తున్నారు. జిల్లాలో ప్రతిఏటా వందల సంఖ్యలో యువకులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

● ప్రమాదాలకు కారణాలివేనా?

బ్లాక్‌స్పాట్లు గుర్తించిన తర్వాత ఆర్ అండ్‌బీ, నేషనల్ హైవేస్, విద్యుత్తు, ఆర్టీఏ, మునిసిపల్ కార్పొరేషన్, పోలీస్ విభాగాల పాత్ర ఎక్కువ. విద్యుత్తు, రోడ్డు మార్కింగ్‌లు, బోర్డుల ఏర్పాటు ఆ శాఖల పనే. శాఖల మధ్య సమన్వయ లోపం, రక్షణ పనుల్లో అలసత్వంవల్ల బ్లాక్ స్పాట్లు ఎక్కువగా పుట్టుకొస్తున్నాయి. వాహనదారులు అతివేగం, నిద్రమత్తు, మద్యం సేవించి వెళ్లడం, వాహనాలు కండీషన్‌లో లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

● ఇలా చేస్తే..

హైవేలు లేదా రెండు లేన్లు, సింగిల్ లేన్(వరుస) రోడ్లపై వాహదారులకు ఏవి ఎటు వెళ్లాలి.. హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించడం వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలి. రోడ్లపై పార్కింగ్ చేసే వాహనాలపై కఠినంగా వ్యవహరించవచ్చు. రాత్రి వేళల్లో వాహనాల డ్రైవర్ల పరిస్థితిని అంచనా వేయాలి.

● అదుపులేని టిప్పర్లు

ఇసుక, కంకర, మట్టి రవాణా టిప్పర్లు ప్రమాదకరంగా మారాయి. అధిక లోడ్లతో దూసుకుపోతున్నాయి. క్యాబిన్ మినహా టిప్పర్ మొత్తం సరుకుతో నింపేస్తున్నాయి. దీంతో రోడ్లు కూడా ఛిద్రం అవుతున్నాయి.

కాకినాడ జిల్లాలో... 867 ప్రమాదాలు 355 మరణాలు

కాకినాడ జిల్లాలో ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. బైక్‌పై వెళ్తున్న వారిని లారీ ఢీకొనడం, నడిచి వెళుతున్న వారిపై నుంచి కారు దూసుకెళ్లడం వంటివి జరుగుతూనే ఉన్నాయి. జిల్లాలో గడిచిన 11 నెలల్లో పలు ప్రమాదాలు అనేకమందిని ఆసుపత్రి పాల్జేశాయి. జనవరిలో 1482 మంది, ఫిబ్రవరిలో 1365 మంది, మార్చిలో 54 మంది, ఏప్రిల్‌లో 20మంది, మేలో 60మంది, జూన్‌లో 88మంది, జూలైలో 117మంది ఆగస్టులో 682 మంది, సెప్టెంబర్‌లో 260 మంది అక్టోబర్‌లో 195 మంది వివిధ రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలైనట్టు జీజీహెచ్ రికార్డుల్లోని లెక్కలు చెప్తున్నాయి. పోలీసు రికార్డుల ప్రకారం.. జిల్లాలో గతేడాది నవంబర్ నుంచి ఈ ఏడాది నవంబర్ మధ్య 867 మేజర్ రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 355 మంది మరణించారు. 929 మంది గాయపడ్డారు.

తూర్పు గోదావరిలో.. 636 ప్రమాదాలు 260 మరణాలు

తూర్పుగోదావరి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. సరాసరిన నెలకు ఒకరు చొప్పున బలవుతున్నారు. జిల్లాలో గతేడాది 30 బ్లాక్ స్పాట్లు ఉండగా.. ఈ ఏడాది 9 నెలల్లో మరో 3 జత కలిసి మొత్తం 33కి చేరాయి. బ్లాక్ స్పాట్లలోనూ జాగ్రత్తలు శూన్యం అయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకూ గణాంకాలు పరిశీలిస్తే జిల్లాలోని 636 రోడ్డు ప్రమాదాలు జరగగా ఏకంగా 260 మంది ప్రాణాలు విడిచారు. 679 మంది ఆస్పత్రి పాలయ్యారు. ఆర్టీసీ బస్సుల వల్ల 19, ప్రైవేటు బస్సులు 9, లారీలు 116, ట్రాక్టర్లు 11, కార్లు 148, ద్విచక్ర వాహనాలు 227, ఆటో రిక్షాలు 44, ఇతర వాహనాల వల్ల 62 ప్రమాదాలు జరిగాయి. అయితే ఈ ఏడాది ఒక్క సెప్టెంబరు నెలలోనే నేషనల్ హైవేలో 10. ఇతర రహదారుల్లో 8 మంది ఊపిరి ఆగిపోగా.. 57 మంది గాయాలపాలయ్యారు.

కోనసీమ జిల్లాలో... 300 ప్రమాదాలు 40 మరణాలు

216 జాతీయ రహదారి యానాం నుంచి ప్రారంభమై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని సఖినేటిపల్లి వరకు సుమారు 56 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. నిత్యం ఏదో చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లాలో గత 10 నెలల వ్యవధిలో 300 ప్రమాదాలు జరగ్గా, 40 మంది మృత్యువాత పడ్డారు. 310 మంది పైగా క్షతగాత్రులయ్యారు. జిల్లాలో గడిచిన రెండేళ్ల పది నెలల్లో 450 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందగా 1200 మంది క్షతగాత్రులయ్యారు. 2023లో 590 ప్రమాదాలు జరగ్గా, 210 మంది మృతిచెందగా 442 మంది క్షతగాత్రులయ్యారు. 2024లో 613 ప్రమాదాలు జరగ్గా 153 మంది మృతిచెందగా 402 మంది క్షతగాత్రులయ్యారు. 2025లో ఇప్పటి వరకు 300 ప్రమాదాలు జరగ్గా 40 మంది మృతిచెందగా 300 మంది క్షతగాత్రులైనట్టు సమాచారం.

● రెండు కుటుంబాల్లో చీకటి



మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు (మృతుల పాతచిత్రం)

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం దివాన్‌చెరువు పరిధిలోని రఘునాథపురానికి చెందిన రేలంగి శివన్నారాయణ(40)కు భార్య దేవి లలిత(34), కుమార్తెలు వేదహర్షిత(13),వర్షిత(13), కొడుకు మహిధర్ సత్యకుమార్. హర్షిత, వర్షిత కవలలు కావడంతో ఆధార్ వేలిముద్రల సమస్య ఏర్పడగా పరిష్కారం నిమిత్తం ఈఏడాది జూన్ 2న కాకినాడ కలెక్టరేట్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. వీరి వెంట శివన్నారాయణ బావమర్ది తీగిరెడ్డి శివ(30), శివ సతీమణి భవాని (26), కుమార్తె సాన్వి(4) కూడా ఉన్నారు. వీరంతా రంగంపేట మండలం వడిశలేరు సమీపంలోకి రాగా కారు లారీని వెనుకనుంచి బలంగా ఢీకొంది.ఈ ఘటనలో శివన్నారాయణ, దేవిలలిత, హర్షితలతోపాటు శివ, సాన్వి మరణించారు. ఈ ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. తల్లిదండ్రులతోపాటు సోదరిని కోల్పోయి వర్షిత, మహిధర్ చెల్లాచెదురయ్యారు.వర్షిత అమ్మమ్మ దగ్గర కవలగొయ్యిలో ఉంటూ 8వతరగతి చదువుతోంది.



తాత ఆరోగ్యం బాగోక మంచాన పట్టాడు. మహిధర్ రాజమహేంద్రవరంలో పెద్దమ్మ దగ్గర ఉండి టెన్త్ చదువుతున్నాడు.ఇంకోకుటుంబంలో శివ, అతడి కుమార్తె సాన్వి చనిపోయారు. భార్య భవాని గాయాలతో బయటపడి భర్త,కుమార్తె లేకపోవడంతో మనోవేదనకు గురవుతోంది.

● కుమార్తె, మనువరాలిని కోల్పోయి..



తాళ్లరేవు ప్రమాద ఘటన

(కాకినాడ-ఆంధ్రజ్యోతి): తాళ్లరేవుమండలం పైడా ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఈ ఏడాడి జూలై 25న ఓ ప్రైవేటు ట్రావెల్స్‌బస్సు ఓ ఆటోను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో యానాం కురసాంపేటకు చెందిన ఆటోడ్రైవర్ కూరాకులకుమార్(30), కాకినాడ ఏటిమొగకు చెందిన తల్లీకూతుళ్లు పోతాబత్తుల దుర్గ(55), లంకే భవానీ(35) అక్కడికక్కడే మృతిచెందగా ఓలేటి లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనతో ఒకేసారి కుమార్తె, మనువరాలిని కోల్పోయిన దుర్గ తల్లి లంకే ధనలక్ష్మి విలపిస్తోంది. తన మనుమరాలి పిల్లలు ఇద్దరూ అనాథలయ్యారని, ఇదే ప్రమాదంలో గాయపడిన తన చిన్నకుమార్తె లక్ష్మి పూర్తిగా మంచానపడిందని, ఆమెకు నాలుగు ఆపరేషన్లు అయ్యాయని విలపించింది. తమకు ఇప్పటికీ ఎవరూ ఏసాయం అందించలేదని చెప్పింది.



మనువరాలి ఫొటోతో ధనలక్ష్మి

● తల్లిదండ్రులకు శోకం మిగిల్చి..

(ముమ్మిడివరం-ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం 216 హైవేపై పాతయింజరం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఈ ఏడాది ఫిబ్రవరి 28న యానాం నుంచి స్పోర్ట్స్ బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులను గుర్తుతెలియని వాహనం ఢీకొనగా వారు అక్కడికక్కడే మృతి చెందారు. వీరిలో ఒకరు ముమ్మిడివరం టెలీఫోన్ ఎక్స్ఛేంజ్ వీధికి చెందిన దొమ్మేటి జయఅభినవ్(17) కాగా మరొకరు కర్రివానిరేవు పంచాయతీ పరిధిలోని బూరుగుపేటకు చెందిన మట్టా ఆకాష్‌రెడ్డి(21). ఒక్కగానొక్క కుమారుడి మృతితో జయఅభినవ్ తల్లిదండ్రులు బాధతో కుంగిపోతున్నారు. మట్టా ఆకాష్‌రెడ్డి(21) వారి కుటుంబంలో పెద్ద కుమారుడు. చేతికి అంది వచ్చిన కుమారుడి మరణంతో తల్లిదండ్రులు విలపిస్తున్నారు. ప్రయాణంలో హెల్మెట్ ధరించకే తమ కుమారుడు మృతిచెందాడని, అలా ఎవరూ చేయొద్దని తెలిపారు. అతడిస్నేహితులు ముమ్మిడివరంలో హెల్మెట్‌లు పంచారు.

'కొండంత అండను కోల్పోయాం'

(ఏలేశ్వరం-ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరంలో హైవేపై ఈనెల 8న ఉదయం అన్నవరం నుంచి వస్తున్న పెళ్లికారు బీభత్సం సృష్టించింది. ఆ సెంటర్‌లో ఉన్న ప్రజలను నిద్రమత్తులో డ్రైవర్ వేగంగా వచ్చిఢీకొన్నాడు. ఈఘటనలో స్థానికులు మొర్త ఆనందరావు(65), మొర్త కొండయ్య(30)తోపాటు ఏలేశ్వరానికి చెందిన కాకాడ రాజు(45) మృతి చెందారు. వీరిలో బొప్పాయిలు అమ్ముకునే కాకాడ రాజుకు ఆరుగురు సంతానం. తన తండ్రి కుటుంబానికి కొండంతఅండగా ఉండేవాడని, వయసు మీదపడినా కాయకష్టం చేస్తూ చేదోడుగా ఉండేవాడని, ఆయన దూరం కావడాన్ని తట్టుకోలేకపోతున్నామని కుమారుడు ఏసుబాబు వాపోయాడు.

సత్యదేవుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు



అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

- ఒక్కరోజే సుమారు 12 వేల వ్రతాలు
- లక్ష మార్కు దాటిన సత్యదేవుడి కార్తీకం వ్రతాలు

అన్నవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం సత్యదేవుడి సన్నిధికి కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా శనివారం భక్తులు పోటెత్తారు. ఈ ఏడాది కార్తీకమాసంలో తొలిసారి 10వేల మార్కుదాటి 11,647 వ్రతాలు ఒక్కరోజే జరగడం విశేషం. దీంతో శనివారంతో సత్యదేవుడి కార్తీకమాస వ్రతాల సంఖ్య 1,15,086కు చేరింది. కార్తీకం ముగియడానికి నాలుగ రోజులు సమయం ఉండగా 1,35,000 జరగవచ్చనని అంచనా వేస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఒంటి గంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. సత్యదేవుడి అంతరాలయ దర్శన టిక్కెట్ల విక్రయాలు పూర్తిగా నిలుపుదల చేశారు. యంత్రాలయ దర్శనం నిలుపుదల చేసి లఘుదర్శనానికి పరిమితం చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనం వ్రతాలకు సుమారు 4గంటల సమయం పట్టడంతో ఉపవాసంతో వ్రతం చేసుకున్న భక్తులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఛైర్మన్ రోహిత్ పశ్చిమ రాజగోపురం వద్ద లిఫ్ట్ సమీపంలో ఉండి రద్దీని నియంత్రణ చేశారు.మరోపక్క వాహనాల పార్కింగ్‌కు స్థలాభావం ఏర్పడడంతో పోలీసులు కొండ దిగువన మైదానంలో వాహనాలను నిలుపుదల చేశారు.నిత్యాన్నదాన ట్రస్ట్ ద్వారా భక్తులకు ఉచిత పులిహోర వితరణ చేశారు. మరో పక్క శనివారం రాత్రికి వివాహాలు ఉండడంతో సత్రం గదుల కేటాయింపు కష్టంగా మారింది.

తుని ఎమ్మెల్యే పూజలు

సత్యదేవుడి సన్నిధిని తుని ఎమ్మెల్యే యనమల దివ్య కుటుంబ సభ్యులతో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఛైర్మన్ రోహిత్ వారికి స్వామివారి మెమెంటో, ప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గంటా విష్ణు తదితరులున్నారు.

తాళం వేసున్నా దోచేస్తారు..

- దొంగతనాలు చేస్తున్న ముగ్గురిని పట్టుకున్న కాకినాడ పోలీసులు
- చోరీ సొత్తు కొనుగోలు చేసే మరో ఇద్దరి అరెస్ట్
- రూ.42.60 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాల స్వాధీనం



చోరీ సొత్తును పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ

తాళం వేసి ఉన్న ఇళ్లను కొల్లగొడుతూ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని పట్టుకోవడంతో పాటు పాటు ఆ చోరీ సామగ్రిని కొనుగోలు చేస్తున్న మరో ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రూ.42 లక్షల 60 వేలను కాకినాడ జిల్లా పోలీసులు రికవరీ చేశారు. ఈ వివరాలను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మీడియాకు వెల్లడించారు.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలోని కాకినాడ వన్‌టౌన్, త్రీ టౌన్, పోర్ట్, ఇంద్రపాలెం, కరప, కాకినాడ రూరల్ ప్రాంతాల్లో జరిగిన 7 చోరీ కేసులను చేదించి ముగ్గురు నిందితులను, ఇద్దరు రిసీవర్లను అరెస్టు చేసినట్టు ఎస్పీ పేర్కొన్నారు. వారి నుంచి రూ.41 లక్షల విలువైన 331 గ్రాముల బంగారాన్ని, రూ.1.60 లక్షల విలువైన కిలో వెండిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఇంద్రపాలెం పోలీసులు సీఆర్ నంబర్ 217/2025 కేసులో సుంకర తేజ, సుంకర అచ్యుత వరప్రసాద్, బండి హారిక అనే నిందితులను శనివారం ఉదయం చీడిగ బ్రిడ్జి వద్ద అరెస్టు చేశారని ఎస్పీ తెలిపారు. అలాగే పోర్టు పోలీసులు సీఆర్‌నంబర్ 134/2025 యు/ఎస్ 331(3), 305(ఏ), బీఎన్ఎస్ కేసులో కర్రి నాని, మోది కార్తీక్‌ను శనివారం ఉదయం పర్లోపేట డంపింగ్‌యార్డు సమీపాన అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు. వీరితో పాటు నేరాలకు పాల్పడిన ఇంద్రపాలెం పీఎస్ పరిధిలోని కటకం పద్మరాజు, పోర్టు పీఎస్ పరిధిలోని కర్రి దుర్గాప్రసాద్ పరారీలో ఉన్నారని తెలిపారు.

పాత నేరస్తులు.. ఇళ్లల్లో చోరీలు..

తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, బయట కిటికీల వద్ద, షూ స్టాండుల వద్ద దాచిపెట్టిన తాళాలను వెతికి, వాటితో ఇంటిలోకి ప్రవేశించి, దొంగతనాలు చేయడంలో పాతనేరస్తుడు సుంకర తేజ ఆరితేరాడు. అతడు దొంగిలించిన సొత్తును తనకు అన్న వరసైన సుంకర అచ్యుత వరప్రసాద్, బండి హారికకు అమ్ముతూ వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తున్నాడు. అలాగే పోర్ట్ పీఎస్ పరిధిలో కర్రి దుర్గాప్రసాద్, కర్రి నాని, మోదీ కార్తీక్ ఇంటికి వేసి ఉన్న తాళాలు గుర్తించి, 290 గ్రాముల బంగారం, కిలో వెండి, కొంత నగదు దొంగిలించగా వారి నుంచి 231 గ్రాముల బంగారం, కిలో వెండి రికవరీ చేసినట్టు ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులో పాత నేరస్తుడైన కర్రి దుర్గాప్రసాద్ పరారీలో ఉన్నాడని, అతడి ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విలువైన వస్తువులను లాకర్‌లో భద్రపరచుకోవాలని, ఎల్‌హెచ్ఎంఎస్ ఉచిత పోలీసు సర్వీసును ఉపయోగించుకుని నేరాలు జరగకుండా చూడాలని తెలిపారు. నిందితునులను పట్టుకుని చోరీ సొత్తు రికవరీకి ప్రత్యేక కృషి చేసిన కాకినాడ సబ్ డివిజనల్ పోలీసు ఆఫీసర్ దేవరాజ్ మనీష్ పాటిల్, కాకినాడ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వి.కృష్ణ, కాకినాడ పోర్ట్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.సునీల్‌కుమార్, కాకినాడ రూరల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ చైతన్య, క్రైం ఎస్ఐ బి.వినయ్‌ప్రతాప్, ఇంద్రపాలెం ఎస్ఐ వీరబాబు, పోర్ట్ ఎస్ఐ నరేంద్ర సతీష్‌బాబు, ఏఎస్ఐలు కె.గోవిందరావు, శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుళ్లు కె.ఎస్.వర్మ, జి.నరసింగరావు, పీఎల్‌వీవీఎస్ ప్రసాద్, బంగార్రాజు, ఆంజనేయ స్వామి, కె.వెంకటరత్నాన్ని అభినందించారు.

రాజమండ్రి అభివృద్ధికి కృషి

ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి తన పరిధిలో కృషి చేస్తున్నానని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. త్వరలో జరగబోయే గోదావరి పుష్కరాల పనులపై శాఖలవారీ సమీక్ష చేయాల్సి ఉందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పుష్కరాలను ఘనంగా నిర్వహించడానికి కార్యాచరణ రూపొందిస్తున్నాయని పేర్కొన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజమండ్రి పెద్ద రైల్వేస్టేషన్‌కు రూ.270 కోట్లు నిధులు తెచ్చామని, పుష్కరాల్లోగా పనులు పూర్తి చేయడానికి వీలుగా ప్లాట్‌ఫార్మ్స్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, స్టేషన్‌కు ఇరువైపులా అభివృద్ధి పనులు కోసం మూడు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలవాలని రైల్వేమంత్రితో మాట్లాడానని అన్నారు. కొవ్వూరులో రెండు రైళ్లకు, అనపర్తిలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు హాల్టు తెచ్చామన్నారు. పొగాకు రైతుల సమస్యను దృష్టిలో పెట్టుకుని వారితో సమావేశమయ్యేందుకు ఈనెల 28, 29 తేదీల్లో కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ఇక్కడకు వస్తున్నారన్నారు. మోరంపూడి ఫ్లై ఓవర్ వద్ద లైట్లు, సర్వీసు రోడ్ల నిర్మాణంపై కేంద్ర మంత్రి గడ్కరీతో మాట్లాడామన్నారు. మొంథా తుఫాను వల్ల నష్టపోయిన పంటలపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. అనకాపల్లి-దివాన్ చెరువు ఎన్‌హెచ్ 16 ఆరులేన్ల రహదారిగా అభివృద్ధి చేస్తున్నారని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. పార్టీ నాయకులు, ఎప్పటికప్పుడు సమస్యలను తన దృష్టికి తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బొమ్ముల దత్తు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజల వనసమారాధన

శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్‌కు రూ.కోటి విరాళం ప్రకటించిన మంత్రి సుభాష్



అమలాపురం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని కొంకాపల్లి సత్తెమ్మతల్లి ఆలయం వద్ద ఈ నెల 16న ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ నాలుగో కార్తీక వనసమారాధన ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, సంఘ పెద్దలతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 2లక్షల మంది వనసమారాధనకు హాజరవుతారన్నారు. వాసంశెట్టి సత్యం ఫౌండేషన్ ఛైర్మన్ సత్యం మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఉభయ రాష్ట్రాల నుంచి 300 బస్సులు, కార్లలో పెద్దసంఖ్యలో సంఘీయులు రానున్నట్టు తెలిపారు. అట్టడుగున ఉన్న సంఘీయులను ఆదుకునేందుకు మంత్రి సుభాష్ రూ.కోటి విరాళం ప్రకటించారని, సోమవారం నాటికి ఎస్ఏఎఫ్ ఖాతాలో ఆ నిధులు జమవుతాయన్నారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా జరిగే ఈ ఆత్మీయ కలయికను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, వాసంశెట్టి చినబాబు, రాయుడు సత్యరుషి, దొంగ శ్రీను, గుత్తుల నాగేశ్వరరావు, చొల్లంగి వెంకటరమణ, మామిడిశెట్టి శివరామప్రసాద్ పాల్గొన్నారు.

చోరీలు చేసి.. చలిమంట వేసి!

పట్టుబడ్డ ఇద్దరు దొంగలు

పరారీలో మరొకరు

చింతూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చోరీలు చేసిన దొంగలు చలిమంట కాగుతూ గ్రామస్థుల చేతికి చిక్కారు. వివరాలివి.. అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో శుక్రవారం రాత్రి అటవీ అధికారికి చెందిన ద్విచక్రవాహనం (బుల్లెట్) చోరీకి గురైంది. ఆ వాహనాన్ని చోరీ చేసిన ముగ్గురు అదేరోజు రాత్రి మోతుగూడెనికి దాదాపు 60 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కాటుకపల్లిలో చిన్నపాటి దుకాణాల్లో వస్తువులను చోరీ చేశారు. కాగా రాత్రి చలితీవ్రత అధికంగా ఉండడంతో ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ తాటాకింటి సమీపంలో వాహనాన్ని ఆపి ఇంటి పైకప్పు నుంచి తాటాకులు తీసి చలిమంట వేశారు. చలి కాగే సమయంలో ఓ వ్యక్తి కంట ముగ్గురు దొంగలు పడ్డారు. వెంటనే అతడు చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయడంతో వారిని వెంబడించారు. ద్విచక్ర వాహనంతో పాటు ఇద్దరు దొంగలు గ్రామస్థుల చేతికి చిక్కగా, మరో వ్యక్తి పరారయ్యాడు. శనివారం చింతూరు పోలీసుస్టేషన్లో వారిని అప్పగించారు. వీరు ఏలూరు జిల్లా వాసులని తెలిసింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కె.గంగవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో బాలాంతరం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పామర్రు ఎస్ఐ ఎస్‌కే జానీబాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలాంతరం గ్రామానికి చెందిన పంపన భాస్కరరావు (72) , విత్తనాల శివప్రసాద్‌తో కలిసి ఎర్రపోతవరం నుంచి బైక్‌పై బాలాంతరం వెళ్తున్నారు. ఈ సమయంలో ద్రాక్షరామ వైపు నుంచి యానాం వెళ్తున్న లారీ వీరు వెళ్తున్న మోటారు బైక్‌ను వెనుక నుంచి వచ్చి ఢీకొట్టడంతో భాస్కరరావు అక్కడికక్కడే మృతి చెందగా, శివ ప్రసాద్‌కు గాయాలయ్యాయి. భాస్కరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించామని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వై.రామవరం: కొంతమూరు బ్రిడ్జి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వై.రామవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని దేవరమడుగుల ఫీడర్‌కు చెందిన లైన్‌మెన్ పత్రి ప్రభాకర్ (34)మృతిచెందాడు. ఈయనది మారేడుమిల్లి మండలం నర్సాపురం. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. తోటి ఉద్యోగి మృతితో సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏఈ కె.అబ్బాయిదొర, లైన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి, సిబ్బంది సంతాపం తెలిపారు.

గండి పోశమ్మ ఆలయ దర్శనం తాత్కాలికంగా నిలుపుదల

దేవీపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గొందూరులో వెలసిన స్వయంభూ శ్రీ గండి పోశమ్మ వారి ఆలయ దర్శనాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్టు ఆలయ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుందని, దీంతో ఎవరినీ అనుమతించమని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్‌గా రామారావు ఏకగ్రీవం



వైడి రామారావు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కాకినాడ జిల్లా శాఖ చైర్మన్ వైడి రామారావు రాష్ట్ర శాఖ చైర్మన్‌గా ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికయ్యారు. శనివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. దీంతో రామారావు తదుపరి మూడు సంవత్సరాల పదవీ కాలానికి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 20 25 జనవరి 29వ తేదీన అప్పటి చైర్మన్ రాజీనామాతో ఏర్పడిన ఖాళీలో రామారావు బాధ్యతలు స్వీకరించనున్నారు. దీంతో జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, జిల్లా కార్యవర్గ సభ్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఎస్‌కేవీటీలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఫస్టియర్ స్పాట్ అడ్మిషన్లకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ వివిధ డిగ్రీ కోర్సులకు సంబంధించి మూడు దశల్లో ఇప్పటికే అడ్మిషన్లు పూర్తయ్యాయని, ఇంకా మిగిలిన కొన్ని సీట్లకు స్పాట్ అడ్మిషన్స్ ద్వారా భర్తీ చేస్తున్నామని తెలిపారు. బీఏ స్పెషల్ తెలుగు, స్పెషల్ ఇంగ్లీష్, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, బీఎస్సీ మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, స్టాటిస్టిక్స్, బయో టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్, బీకాం కామర్స్ (జనరల్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సుల్లో సీట్లు మిగిలి ఉన్నాయని తెలిపారు. ఏ కళాశాలలోను సీటు రాని విద్యార్థులు, తమ కళాశాలలో వేరే కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునేవారు స్పాట్ అడ్మిషన్ల కోసం ఈనెల 17నుంచి 20వరకూ కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ : 74161 79782 నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

పీఎంపీలకు బేసిక్ లైఫ్ సపోర్ట్ శిక్షణ అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ కళాధరరెడ్డి

దివాన్‌చెరువు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : పీఎంపీ సభ్యులకు బేసిక్ లైఫ్ సపోర్ట్ శిక్షణ చాలా అవసరమని ఫస్ట్ ప్లస్ ఆసుపత్రి అధినేత డాక్టర్ బీఆర్ కళాధర్‌రెడ్డి అన్నారు. ప్రాథమిక స్థాయిలో పేదలకు మేలైన వైద్యం అందించాలన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) జిల్లా కార్తీక వనసమారాధన, సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. లాలాచెరువు సమీపంలోని గోదావరి మహా పుష్కరవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాధర్‌రెడ్డి మాట్లాడుతూ అర్హత గల, అనుభవ వైద్యుల ద్వారా వైద్యవిధానాలను నేర్చుకోవడం వల్ల మంచి పీఎంపీలుగా అనుభవం సంపాదించడానికి వీలవుతుందన్నారు. ఈ సందర్భంగా జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ ఈ నెల 29న జీఎస్‌ఎల్ వైద్యకళాశాలలో నిర్వహిస్తున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రామీణ వైద్యుల మహాసభకు పీఎంపీలందరూ తప్పని సరిగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, ఎన్.జయసూర్య, ఎంవీఆర్ మూర్తి, రొక్కం నాగేశ్వరరెడ్డి, ఎంఎస్ రాజు పాల్గొన్నారు.

దువ్వూరి త్యాగం నేటి తరానికి తెలియాలి

కడియం ఎంపీపీ ప్రసాద్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్

కడియం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు దువ్వూరి సుబ్బమ్మ త్యాగం నేటి తరానికి తెలియాలని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. శనివారం కడియంలో దువ్వూరి సుబ్బమ్మ 145వ జయంతి కార్యక్రమం కమిటీ అధ్యక్షుడు చిలుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో జైలుకు వెళ్లిన తొలి తెలుగు మహిళ దువ్వూరి కడియం వాసి కావడం గర్వకారణమన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ సుబ్బమ్మ తన యావదాస్తిని స్వాతంత్ర్య ఉద్యమం కోసం వెచ్చించారన్నారు. ఆమె బ్రిటిష్ బలగాలను ఎదురొడ్డి పోరాడిన ధీశాలి అని, అందుకే ఆమెను గాంధీజీ దేశబాంధవిగా పిలిచేవారన్నారు. కార్యక్రమంలో న్యాయవాది తోరాటి వసంతరావు, చిక్కాల ఈశ్వరరావు, బోనం సత్యనారాయణ, దేవవరపు నీలకంఠరావు, బొర్రా రామకృష్ణ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



బిక్కవోలులో ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పేరొందిన బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి మహోత్సవ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శనివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25నుంచి డిసెంబరు 2 వరకూ ఉత్సవాలు నిర్వహిస్తామని, 26న షష్ఠి ఉత్సవం జరుతామన్నారు. 27న స్వామివారి రథోత్సవం జరిపి 30 వరకు షష్ఠి కళావేదికపై వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, డిసెంబరు 2న మహాన్నదానంతో ఉత్సవాలు ముగిస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు.కమిటీ సభ్యులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి,సింగారపు రామారావు, పల్లి రాజారెడ్డి, బేరా గోవిందు, గుణ్ణం రమేష్‌చౌదరి, బేరా శ్రీను, కూటమి నేతలు పాల్గొన్నారు.

21 నుంచి షష్ఠి ఉత్సవాలు

దివాన్‌చెరువు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని రాంబాబు డాక్టరు గృహావరణలోని ఆలయంలో కొలువై ఉన్న శ్రీబాలకుమారస్వామి షష్ఠి ఉత్సవాలు ఈ నెల 21 నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు డాక్టర్ కేవీఆర్ సుబ్రహ్మణ్యం(లక్ష్మీరాంబాబు) శనివారం తెలిపారు. ఈ నెల 26 వరకూ జరిగే ఈ ఉత్సవాల్లో ఉదయం రుద్రాభిషేకాలు, సాయంత్రం విశేష పూజలు జరుగుతాయని చెప్పారు. ఆఖరి రోజైన షష్ఠినాడు సుబ్రహ్మణ్యేశ్వర మంత్రంతో హోమం జరుగుతుందని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కోరుకొండ జూనియర్ కళాశాల పదో తరగతి 1994-95 బ్యాచ్ విద్యార్థులు

గోకవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కోరుకొండ రాజబాబు జూనియర్ కళాశాల్లో పదో తరగతి చదివిన 1994-95 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం మండలం లోని వీరలంకపల్లి శివారున కోరుమిల్లి అప్పలస్వామి తోటలో జరిగింది. 30 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాడు తరగతి గదిలో చేసిన అల్లరి చేష్టలను, మధురానుభూతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.గోవిందు, సత్తర్, మధు, శ్రీరామకృష్ణ, వాసవి, పద్మలత, సత్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

బీహార్‌లో ఎన్డీయే గెలుపుపై విజయోత్సవ ర్యాలీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గోకవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బీహార్‌లో ఎన్డీయే విజయం సాధించడం పట్ల గోకవరంలో శనివారం విజయోత్సవ ర్యాలీ జరిగింది. విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామ శివారున గంగాలమ్మ గుడి నుంచి రాణా సెంటర్ మీదుగా డ్రైవర్స్ కాలనీ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. రాణా సెంటర్‌లో శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ ప్రజలు ప్రధాని మోదీ నాయకత్వంపై తిరుగు లేని నమ్మకాన్ని ప్రదర్శిస్తున్నారని చెప్పడానికి ఈ ఎన్నికలే తార్కాణమని అన్నారు. ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ కూటమి ఎన్ని కుయుక్తులు చేసినా ఓటమి తప్పలేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, రామసేన సభ్యులు పాల్గొన్నారు.

సంగీత నృత్య కళాశాలలో సాంస్కృతిక ప్రదర్శన



రాజమహేంద్రవరం సంగీత నృత్య కళాశాలలో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని విజయ శంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో శనివారం సాయంత్రం నెలవారీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాలల దినోత్సవం సందర్భంగా సంగీత నృత్య కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి, అనంతరం పాఠశాల విద్యార్థినులతో సంగీతం, నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. తమ నృత్య ప్రతిభ సభికులను ఆకట్టుకున్న విద్యార్థులకు అభినందన జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొని జయప్రదం చేశారని ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస శర్మ తెలియజేశారు.

గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలి

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
అనపర్తిలో సామూహిక సీమంతాలు



అనపర్తిలో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

అనపర్తి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గర్భిణులకు శారీరక ఆరోగ్యంతో బాటు మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.శనివారం అనపర్తి ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో పరంజ్యోతి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సీమంతాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఆరు పీహెచ్‌సీల పరిధిలోని 50 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్‌పర్సన్ వర్ధినీడి విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ప్రసంగిస్తూ గర్భం దాల్చిన నాటి నుంచి నెలలు నిండే వరకు కుటుంబీకులు ఆమె సంతోషంగా ఉండేలా చూసుకోవాలన్నారు.డీసీహెచ్‌ఎస్ పద్మ మాట్లాడుతూ పరంజ్యోతి సంస్థ సేవలను కొనియాడారు. ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇదిలా ఉండగా ఆసుపత్రిలో జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే రోగులకు సేవలందించడంలో వైద్యులు, కమిటీ ప్రతినిధులు శ్రద్ధ చూపాలన్నారు. అలాగే ఆసుపత్రికి అవసరమైన సదుపాయాల కల్పనపై చర్చించారు. ఏపీఐఎస్‌ఐడీసీ ఇంజనీర్ రత్నరాజుతో పలు అంశాలపై మాట్లాడారు. ఆసుపత్రి స్థల నిర్ధారణపై గ్రామ పెద్దలు ముందుకు వస్తే ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసే కార్యక్రమం చేపడతామన్నారు.

'క్యాడర్ కోసం నల్లమిల్లి'

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'క్యాడర్ కోసం నల్లమిల్లి' కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి అధికారులు, క్యాడర్‌తో పలు అంశాలపై చర్చించారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటి నుండే క్యాడర్ పని చేయాలని సూచించారు. కూటమి నాయకులు గ్రామాల్లో ఏర్పడే చిన్న చిన్న వివాదాలను పరిష్కరిస్తూ క్యాడర్ ఐకమత్యానికి కృషి చేయాలన్నారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

ఈనెల 22న అనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాలలో వికాస ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళా పోస్టర్‌ను ఎమ్మెల్యే నల్లమిల్లి వికాస అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మేళాలో సుమారు 30 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో సిరసపల్లి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, ఎన్ఆర్‌కే ప్రసాదరెడ్డి, డీసీ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, కర్రి శేషారత్నం, పోతంశెట్టి సుభాషిణి, రావాడ నాగు, దాకే దుర్గాప్రసాద్, అన్నవరం, రాంబాబు, వనుము మల్లేశ్వరి, ఆర్ఎంవో డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ భరత్ అవినీతిపరుడే

టీడీపీ నగర అధ్యక్షుడు రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మజ్జి రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అవినీతి పరుడేనని టీడీపీ నగర అధ్య క్షుడు మజ్జి రాంబాబు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎంపీ అధికారంలో ఉన్నప్పుడు అతను కమీషన్లు తీసుకుంటున్నాడని, అవినీతికి పాల్పడుతున్నాడని తాము చెబుతూనే ఉన్నామని, తాజాగా భరత్‌రామ్ చీకటి దందాలను అతడి స్నేహితుడు రామశర్మ బయటపెట్టాడన్నారు. పేపరుమిల్లు పరంపర కార్మికుల డబ్బు ప్రవీణ్ చౌదరి నుంచి రూ.1.50 కోట్లు తీసుకున్నాడని, ఒక్క రామశర్మ నుంచే నెలకు సుమారు రూ.కోటి తీసుకున్నాడంటే, అలాంటి అనుచరులు భరత్‌రామ్‌కు చాలా మంది ఉన్నారని, వారి ద్వారా ఐదేళ్లలో సుమారు రూ.60 కోట్లు అవినీతికి పాల్పడి ఉంటాడని ఆరోపించారు. వీడియోలు ఆడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసి నగరంలో బలంగా ఉన్న టీడీపీని టార్గెట్ చేసి తమపై బురద జల్లేందుకు విశ్వ ప్రయత్నాలు చేశాడన్నారు. యిన్నమూరి దీపు మాట్లాడుతూ గతంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక తనను చాలా ఇబ్బందులు పెట్టి, తన స్నేహితుడు రామశర్మ ద్వారా భయపెట్టి పార్టీ మారేలా చేశారన్నారు. తనతో పార్టీ కార్యక్రమాలకు లక్షల్లో డబ్బులు ఖర్చు పెట్టించారని, రామశర్మ ఆర్థికంగా స్థితి మంతుడు కాదు కాబట్టి అప్పులపాలయ్యాడని తాను నిలబడ్డానని చెప్పారు. సమావేశంలో టీడీపీ నగర ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకిరామయ్య, శెట్టి జగదీష్, కంటిపూడి శ్రీనివాస్, కడలి రామకృష్ణ, పిల్లి శ్యామ్, ముత్యం సత్తిబాబు, ముద్రగడ జయరామ్, షేక్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రాజమహేంద్రవరానికి మంత్రి లోకేశ్

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం సాయంత్రం రాజమహేంద్రవరం రానున్నట్టు పార్టీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు తెలిపారు. లోకేశ్ సోమవారం సాయంత్రం 5గంటలకు రాజమహేంద్రవరంలోని చెరుకూరి కళ్యాణ మండపానికి చేరుకుని, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నేతృత్వంలో జరిగే అర్బన్ టీడీపీ సమావేశంలో పాల్గొంటారన్నారు. 18న ఉదయం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో అధికారిక ప్రారంభోత్సవాల కార్యక్రమాల్లోను, మధ్యాహ్నం నన్నయ యూనివర్శిటీలో జరిగే కార్యక్రమంలోను పాల్గొంటారన్నారు. సాయంత్రం తిరిగి విజయవాడ ప్రయాణవుతారని రాంబాబు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులకు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కృష్ణునిపాలెంలో అన్నసమారాధన

గోకవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం కృష్ణునిపాలెం గ్రామ శివాలయం వద్ద శనివారం అన్నసమారాధన జరిగింది. కార్తీక మాసం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా పార్వతి సమేత విశ్వే శ్వరస్వామిని దర్శించుకున్నారు.

బిర్సా ముండా జయంతి

బిక్కవోలు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గిరిజన నాయకుడు బిర్సా ముండా జయంతి శనివారం కొమరిపాలెం అమ్మిరెడ్డి నగర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సునీత బిర్సా ముండా గిరిజన హక్కుల కోసం బ్రిటీషు వారితో చేసిన పోరాటాలను వివరించారు. అనంతరం టీవీలో ఎస్‌సీఈఆర్‌టీ తయారు చేసిన బిర్సా ముండా జీవిత చరిత్రను తెలిపే వీడియోలను చూపించారు.

బైక్ నుంచి జారిపడి మహిళకు గాయాలు

బిక్కవోలు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు కెనాల్ రోడ్‌లో బైక్ నుంచి జారిపడి గాయాల పాలైన మహిళను ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. శనివారం ఉదయం బిక్కవోలు నుంచి బలభద్రపురం వైపు భార్యాభర్తలు బైక్‌పై వెళ్తుండగా ఆర్ఎస్ పేట సమీపంలో బైక్ గోతిలో పడడంతో బైక్‌పై వెనుకు కూర్చున్న భార్య కింద పడిపోవడంతో గాయాలయ్యాయి. ఆ సమయంలో అనపర్తి వెళ్తున్న బిక్కవోలు ఎస్ఐ వెంటనే ఆమెను ఆటోలో బిక్కవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించి పంపారు.

మోరంపూడిలో వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు-2025లో భాగంగా శనివారం ఏపీ గ్రామీణ బ్యాంకు మోరంపూడి శాఖలో వైద్య శిబిరం నిర్వహించారు. బ్యాంకు సిబ్బందికి, ఖాతాదారులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి గుంటూరు ఏపీజీబీ హెడ్ ఆఫీస్ నుంచి చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ హరీష్‌బేతా ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఖాతాదారులు, సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ గంటా శ్రీనివాసరావు, బ్రాంచి మేనేజర్ కె.వెంకట సందీప్ పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు

రాష్ట్ర కార్యదర్శి కిరణ్‌కుమార్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో గోదావరి గట్టునున్న చందాసత్రంలో ఈనెల 28, 29 తేదీల్లో జరగనున్న పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం పోస్టర్‌ను రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేస్తూ ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. పేద, మధ్యతరగతికి ఉన్నత విద్యను దూరం చేస్తూ గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 77 రద్దు చేయలేదని, కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయలేదని, హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో భానుప్రసాద్, దినేష్‌బాబు, ధర్నేష్, సంతోష్, రోహిత్, ఐఎఫ్‌టీయూ చీకట్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వినోబా భావే వర్ధంతి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆచార్య వినోబా భావే ప్రారంభించిన భూదాన మహాయజ్ఞం దేశంలో అహింసాత్మక సామాజిక మార్పునకు చిరస్థాయి చిహ్నంగా నిలిచిందని భూదాన భూముల రైతు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి కొమ్మాది రషీద్ అన్నారు. భావే 43వ వర్ధంతి సందర్భంగా స్థానిక సరిపల్లి సత్యనారాయణరాజు వసతి గృహంలో శనివారం భావే చిత్రపటానికి రషీద్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భావే దేశంలో భూముల స్వచ్ఛంద దానంతో లక్షల ఎకరాలు సేకరించి భూమిలేని పేదలకు అందజేసిన త్యాగమూర్తి అని, ఆయన సేవానిరతి నేటికి ప్రజాఉద్యమాలకు స్ఫూర్తి అని అన్నారు. భూదాన వ్యవస్థ నిలిచిపోయిందని రాష్ట్ర విభజనలో ఆంధ్రాకు రావాలసిన రూ.19 కోట్ల నిధులు తెలంగాణ భూదాన బోర్డు నుంచి రావాల్సివుందని వాటిని విడుదల చేయించుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న భూదాన కేసులను పరిశీలించి అర్హులైన బాధితులకు హక్కు కల్పించాలని రషీద్ కోరారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సమితి వలంటీర్లు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం అందజేత



డిపాజిట్ పత్రాలను బాలుడి తల్లిదండ్రులకు అందిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అరుదైన వ్యాధితో బాధపడుతున్న నాలుగేళ్ల బాబుకు పూర్తి వైద్యం చేయించేందుకు రూ.లక్ష, ఆ బాబు పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసేందుకు రూ.2 లక్షలు కలిసి రూ.3 లక్షలు సేకరించిన స్వచ్ఛంద సేవకుడు సుభాని, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవి వరప్రసాద్‌లను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అభినందించారు. శనివారం స్థానిక తిలక్ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో బాబు నిహార్ తల్లిదండ్రులకు రూ.2 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన బాండ్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అందించారు.రాజమహేంద్రవరానికి చెందిన మానుకొండ నవీన్ (ఆటో డ్రైవర్), రమ్యశ్రీ దంపతుల నాలుగేళ్ల కుమారుడు నిహార్ హైడ్రోసీఫిలిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. వారికి వైద్యం చేయించే స్థోమత లేదు. విషయం తెలుసుకున్న సుభాని సోషల్ మీడియాలో ఇదే సమస్యను పోస్ట్ చేస్తే దాతలు స్పందించి రూ.3 లక్షలు నగదు పంపారు. ఈ విషయాన్ని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవివరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లడంతో అతను స్పందించి ఎమ్మెల్యే వాసు కు తెలియజేశారు. దీంతో ఆయన వైద్యానికి అయ్యే ఖర్చులో రాయితీ కల్పించాలని ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. దీంతో రూ.లక్ష ఆసుపత్రికి చెల్లించి, మిగిలిన రూ.2 లక్షలను బాబు పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి ఎఫ్‌డి పత్రాన్ని తల్లిదండ్రులకు అందించారు. ఈ సందర్భంగా సుభానిని, నక్కా దేవిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో.. రేషన్ షాపుల తనిఖీ

కొవ్వూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను పారదర్శకంగా పంపిణీ చేయాలని ఆర్డీవో రాణిసుస్మిత అన్నారు. శనివారం కొవ్వూరు మండలం దొమ్మేరులో రేషన్ షాపులను ఆమె తనిఖీ చేశారు. రేషన్ స్టాక్, స్థితి, పంపిణీ, రికార్డులు, బయోమెట్రిక్ హాజరు, స్టాక్ నిల్వలను పరిశీలించారు. దొమ్మేరులో అధికంగా స్టాక్ నిల్వలు ఉండడాన్ని గమనించారు. ఆర్డీవో మాట్లాడుతూ 65 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ సరుకులు ఇంటి వద్దనే అందించాలన్నారు.

పుస్తక పఠనం విద్యా ప్రగతికి సోపానం



రంగంపేటలో చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రంగంపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చిత్రలేఖనంతో విద్యార్థుల్లోని సృజనాత్మకశక్తి వెలికితీయవచ్చునని, పుస్తక పఠనం విద్యాప్రగతికి సోపానమని రంగంపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.లీలాకుమారి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎస్.రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం దినచర్యగా అలవాటు చేసుకోవాలని సూచించారు. ముందుగా గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో హైస్కూల్ క్రాఫ్ట్ టీచర్ బి.లక్ష్మి, ఉపాధ్యాయుడు శ్రీకాంత్, టేకుమూడి శ్రీను, వజ్రపు వెంకటరమణ పాల్గొన్నారు.

బిక్కవోలు: కొంకుదురు శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా పుస్తక ప్రదర్శనను గ్రంథాలయాధికారి ఎస్.బాల ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు పుస్తకాలను పరిశీలించి, కొన్ని పుస్తకాలను చదువుకున్నారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని బాల చెప్పారు.

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక గరిమెళ్ల సత్యనారాయణ ప్రభుత్వ అత్యున్నత విద్య ఆధ్యాయన సంస్థలో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమ వివరాలను కన్వీనర్ రాజ్యలక్ష్మి వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, గ్రంథాలయాధికారి శ్రీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసన్న కొండపై కార్తీక దీపోత్సవం



నర్సాపురంలో ఏకాహ భజనలు చేస్తున్న దృశ్యం

కోరుకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక ఏకాదశి సందర్భంగా శనివారం రాత్రి స్థానిక లక్ష్మీనరసింహస్వామి కొండ దిగువున పాదాల వద్ద కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఆలయార్చకుల ఆధ్వర్యంలో పుల్లెపు వీరన్నకాపు దంపతులు స్వామి పాదాల వద్ద ప్రత్యేక పూజలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనరోజ, బదిరెడ్డి దొర, చిట్టిబాబు, తాటికొండ శ్రీను, తాటికొండ బుజ్జి,కటకం చలం, సుంకర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్తీక ఏకాహ భజనలు

కార్తీక ఏకాదశి సందర్భంగా శనివారం వేకువజాము నుంచి పలు ఆలయాల వద్ద ఏకాహ భజనలు ప్రారంభించారు. నర్సాపురం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కోనేరు, పశ్చిమగోనగూడెం రామాలయం, జంబుపట్నం రామాలయం, కోరుకొండ పాండురంగస్వామి ఆలయం, బూరుగుపూడి రామాలయం వద్ద ఏకాహ భజనలు జరిగాయి. ఇదిలా ఉండగా కోరుకొండ హరేరామ సమాజం వద్ద కపిలవాయి ఓం నమఃశివాయ శర్మ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. పలువురు యజమాని దంపతులు వ్రతాలు ఆచరించారు. వారందరికీ అన్న సమారాధన జరిగింది. కాగా కార్తీక ద్వాదశి ఆదివారం నర్సాపురం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. పరిసర గ్రామాల భక్తులు వచ్చి స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

శివ-కేశవులుగా గోలింగేశ్వరుడు



బిక్కవోలు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం బహుళ ఏకాదశి సందర్భంగా బిక్కవోలులోని ప్రాచీన గోలింగేశ్వరుడు శివ-కేశవులుగా దర్శన మిచ్చారు. ఈసందర్భంగా స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, లక్ష బిల్వార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.


కోనసీమ అందాలు..




కడియం నర్సరీలు


కోర్దెలియా షిప్ క్రూయిజ్

ప్రగతి పీఠిక..

విశాల సముద్ర తీరం.. పోర్టులు.. నర్సరీలు.. కొబ్బరి.. అరటి.. పామాయిల్.. పౌల్ట్రీ.. గ్యాస్ నిక్షేపాలు.. అబ్బురపరిచే పర్యాటక అందాలు.. ఇలా ఒకటేంటి ఉమ్మడి తూ.గో. జిల్లాలో అపార వనరులు ఎన్నో.. వీటిని మరింత సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధిలో ఆకాశమంత ఎత్తుకు ఎదగడానికి ఎన్నో అవకాశాలున్నాయి. తద్వారా ప్రజల ఆదాయం అమాంతం పెంచి అభివృద్ధి పథంలో నడిపించేందుకు మార్గాలున్నాయి. ఇప్పుడు సీఎం చంద్రబాబు దీనిపైనే దృష్టిసారించారు. కొత్తగా విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను సృష్టించి అందులో ఉమ్మడి తూ.గో.ని చేర్చారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో వేటికవే ప్రత్యేకతలున్నందున ఆయా అంశాల్లో ఈ మూడు జిల్లాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రత్యేక విజన్ ప్లాన్ తయారుచేశారు. 2032 నాటికి ఈ మూడు జిల్లాల్లో సమూల మార్పులు వచ్చేలా ప్రణాళికలు తయారు చేశారు.

అభివృద్ధి సూచిక!

- విశాఖ ఎకనమిక్ రీజియన్ విజన్ ప్రణాళికలో ఉమ్మడి జిల్లాకు పట్టం
- కాకినాడ, కోనసీమ, తూ.గో. జిల్లాల్లో భారీ అభివృద్ధి ప్రణాళికలు
- కాకినాడలో 2 వేల ఎకరాల్లో ఆక్వా పార్కు.. కేజీ బేసిన్‌లో ఉత్పత్తి రెట్టింపు
- కడియం నర్సరీలను దేశ నర్సరీ రాజధానిగా మార్చేలా ప్రతిపాదనలు
- 2 వేల ఎకరాల్లో పాలీహౌస్‌లు, టిష్యూ కల్చర్ ల్యాబ్‌లు, రోబోటిక్ గార్డెన్
- సినిమా షూటింగ్‌లు, రివర్ క్రూయిజ్ ప్రోత్సహిస్తే కోనసీమకు మహర్దశ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ.. ప్రగతి జాడ..

7.4 బిలియన్ డాలర్ల జీడీడీపీతో 2.2 మిలియన్ జనాభా ఉన్న కాకినాడ జిల్లాలో సుదీర్ఘ సముద్ర తీరం.. ఓడరేవు, పరిశ్రమలకు నెలవు. ఈ జిల్లాను ఆయా రంగాల్లో మరింత ఎత్తుకు తీసుకువెళ్లేలా విశాఖ ఎకనమిక్ రీజియన్ ప్రణాళికలో ప్రస్తావించారు. ఇందులోభాగంగా 200ఎకరాల్లో తీర ప్రాంతంలో ప్రభుత్వం ఆక్వా పార్కును ప్రభుత్వం ప్రతిపాదించింది. అలాగే ఇక్కడ త్వరలో 1 ఎంఎంటీపీఏ గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటుకాబోతోంది. అలాగే 2 గిగావాట్ల ఎలక్ట్రొలైజర్ ఉత్పత్తి చేయబోతున్నారు. తద్వారా కాకినాడ అభివృద్ధి చెందడంతోపాటు ఇక్కడ తయారయ్యే గ్రీన్ అమ్మోనియాలో 0.25 మిలియన్ మెట్రిక్ టన్నులు విదేశాలకు ఎగుమతి చేయవచ్చు. ఇక్కడున్న కేజీ బేసిన్ దేశంలో 35 శాతం గ్యాస్ అవసరాలు తీర్చుతోంది. లక్షల కోట్లు టర్నోవర్ జరిగే బేసిన్‌లో మున్ముందు గ్యాస్, చమురు అన్వేషణ పెంచి కొత్త బ్లాక్‌లు తవ్విస్తే రీజియన్ ఆర్థికంగా మరింత బలోపేతమవుతుంది. అలాగే కాకినాడ నుంచి శ్రీకాకుళం వరకు గ్యాస్ పైపులైన్ నిర్మాణం ఇప్పటికీ జరగలేదు. 20-30 ఎంఎంఎస్‌సీఎంఈ సామర్థ్యంతో దీన్ని వచ్చే ఏడాదిలోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రచించారు. ఇందుకు 100 నుంచి 150 మిలియన్ డాలర్లు అవసరమని అంచనా. తద్వారా ఇంటింటి గ్యాస్ అవసరాలను రీజియన్ మొత్తానికి తీర్చవచ్చు. అలాగే కాకినాడలో ప్రత్యేక గ్యాస్ టెర్మినల్ నిర్మించాలని ప్రతిపాదించింది. 20-30 ఎంఎంఎస్‌సీఎండీ సామర్థ్యంతో 2028-2030కి దీన్ని పూర్తి చేయాలని పేర్కొంది. ఈ రీగ్యాసిఫికేషన్ యూనిట్‌కు 900 మిలియన్ నుంచి 1 బిలియన్ ప్రైవేటు పెట్టుబడులు అవసరమని పేర్కొంది. అలాగే ప్రస్తుతం కాకినాడ డీప్‌వాటర్ పోర్టు 26 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో (ఎంఎంటీపీఏ) సామర్థ్యంతో పనిచేస్తోందని, 2032 నాటికి 63 ఎంఎంటీపీఏకు సామర్థ్యం పెంచాలని పేర్కొంది. అలాగే ఇక్కడున్న ప్రభుత్వ యాంకరేజ్ పోర్టు సామర్థ్యం 4 నుంచి 5కి, రాబోతున్న గేట్‌వే పోర్టు సామర్థ్యం 16 ఎంఎంటీపీఏకు పెంచాల్సి ఉందని గుర్తించింది. అలాగే కాకినాడలో నౌకల తయారీ రంగం అంతంత మాత్రంగానే ఉందని నివేదిక పేర్కొంది. ఓ ప్రైవేటు యార్డు ద్వారా ఏటా 4 వేల నుంచి 5వేల గ్రాస్ టన్నుల తయారీ జరుగుతోందని, వసతులు పెంచి అదనంగా పది వేల గ్రాస్ టన్నుల తయారీ పెంచాలని ప్రతిపాదించింది. అలాగే జిల్లాలో ప్రైవేటు రంగంలో 5,600 ఎకరాల్లో మల్టీప్రొడక్ట్ పార్క్ ఏర్పాటుచేయాలని ప్రణాళిక సిద్ధంచేసింది. బుద్ధిస్ట్, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని పరుగులు తీసేలా పలు సూచనలు చేసింది. ఏటా అన్నవరం దేవాలయానికి 1 మిలియన్, ద్రాక్షారామ 0.2 మిలియన్, పిఠాపురం 0.1 మిలియన్ భక్తులు వస్తున్నారని, ఇది భారీగా పెరిగేలా సన్నద్ధం చేయాలని పేర్కొంది. భవిష్యత్తు అవసరాల్లో భాగంగా పారిశ్రామిక రంగంలో పనిచేసే వారి అవసరాలకు 1,500 ఎకరాల్లో క్లీన్ టెక్ మాన్యుఫ్యాక్చరింగ్ సిటీ ప్రతిపాదించారు. అలాగే కాకినాడ-మూలపేట బైపాస్ రోడ్డు, విశాఖ-కాకినాడ 125 కి.మీ. కోస్టల్ రోడ్డు ద్వారా అన్ని పోర్టులకు అనుసంధానం పెంచి కార్గో రవాణా భారీగా పెంచాలని వ్యూహం రచించారు.

తూ.గో.. నర్సరీల రాజధానిగా..

విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో అత్యధిక జీవీఏ ఉత్పత్తితో తూర్పుగోదావరి జిల్లా ఉంది. 2024 ఆర్థిక సంవత్సరానికి గాను 2.4 బిలియన్ జీవీఏ నమోదుచేసింది. కాకినాడ జిల్లా 2.2 బిలియన్, కోనసీమ 1.9 బిలియన్‌గా ఉంది. వార్షిక జీడీడీపీ 6.8 బిలియన్లతో రెండు మిలియన్ల జనాభా ఉన్న ఈ జిల్లా గుడ్లు, నర్సరీ కేంద్రంగా కొనసాగుతున్నట్టు నివేదిక గుర్తించింది. భవిష్యత్తులో ఇక్కడ ఐసీఏఆర్ లేదా సీఏఆర్ఐ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. కోళ్లు రకరకాల వ్యాధులు తట్టుకునేలా ఈ పరిశోధన కేంద్రం అడుగులు వేయాలని సూచించింది. అలాగే క్రూడ్ పామాయిల్ ఉత్పత్తిలో ఈ జిల్లా 15 శాతం, కాకినాడ 9 శాతంతో టాప్‌లో ఉన్నాయని వివరించింది. భవిష్యత్తులో ఈ ఉత్పత్తి పెరిగితే మరింత ఆదాయం వస్తుందని సూచించింది. అరటి ఉత్పత్తి కూడా ఈ జిల్లాలో అధికంగా ఉన్న నేపథ్యంలో కొవ్వూరులో హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదించింది. నర్సరీ సాగులో ఈ జిల్లా లీడర్‌గా ఉందని దేశ నర్సరీల రంగానికి ఈ ప్రాంతం రాజధాని కానుందని విశ్లేషించింది. 5,500 హెక్టార్లలో సాగవుతున్న నర్సరీల ద్వారా ఏటా 100 మిలియన్ డాలర్ల జీవీఏ వస్తుండగా, 50వేల మందికి ఉపాధి లభిస్తోంది. కానీ ఎగుమతులు 2 శాతం లోపే ఉన్నాయని, 2032 నాటికి ఎగుమతులు 15 శాతం పెంచడానికి ఆస్కారం ఉందని తెలిపింది. ఆర్నమెంటల్, అవెన్యూ మొక్కల ఎగుమతికి ఆస్కారం ఉందని తెలిపింది. నర్సరీల్లో ఆధునిక పద్ధతులు వాడి జీవీఏను 2032 నాటికి 200 మిలియన్ డాలర్లకు పెంచే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొంది. అంటే సాగు 40 శాతం పెరగాలని తెలిపింది. 15 శాతం ఎగుమతులు పెంచితే 120మిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతుందని విజన్ ప్రణాళికలో తెలిపింది. ఇందుకోసం 2వేల ఎకరాల్లో నర్సరీ జోన్‌లు ఏర్పాటుకు ప్రతిపాదించింది. పాలీహౌస్‌లు, టిష్యూ కల్చర్ ల్యాబ్‌లు, రోబోటిక్ గార్డెన్‌తోపాటు శీతల గిడ్డంగుల వసతి కల్పించాల్సి ఉందని తెలిపింది. అలాగే పర్యాటక రంగం మరింత ఎదగడానికి ఈ జిల్లాకు చాలా అవకాశాలున్నాయని, పర్యాటకుల కోసం 6 నుంచి 12 గంటల వ్యవధిలో లాంగ్ హాప్-ఆన్ హాప్-ఆఫ్ రివర్ క్రూయిజ్ పర్యాటకం ప్రోత్సహించాలని పేర్కొంది. రాజమండ్రి-భద్రాచలం, కాకినాడ-దిండి మార్గాల్లో టర్కీ మోడల్ క్రూయిజ్ నడపాలని ప్రతిపాదించింది. భద్రాచలం-రాజమండ్రి లోకల్ సైట్ సీయింగ్, కాకినాడ-దిండి బ్యాక్ వాటర్ లీజర్ క్రూయిజ్‌లు నడపాలని సూచించింది. అలాగే భవిష్యత్తులో ద్రాక్షారామ, పిఠాపురంలో 250 చొప్పున హోటల్ గదులు, అన్నవరం 500 గదులు రావాలని ప్రతిపాదించింది. ఏటా జూలైలో గోదావరి యాత్ర ఏడు రోజులు, నవంబరులో ఏడు రోజులు కాకినాడ బీచ్ ఫెస్టివల్ నిర్వహించాలని తెలిపింది.

కొబ్బరి కేంద్రం.. కోనసీమ

కొబ్బరి పంటకు కేంద్రంగా కోనసీమ జిల్లా ఉందని నివేదికలో నీతిఆయోగ్ వెల్లడించింది. 5.1 బిలియన్ జీడీడీపీతో 1.8మిలియన్ జనాభా ఉన్న జిల్లా ప్రకృతి అందాలకు, గోదావరి, సముద్రం బ్యాక్ వాటర్స్‌కు పెట్టింది పేరని తెలిపింది. ఈ నేపథ్యంలో సినిమా చిత్రీకరణలకు రాజధానిగా జిల్లాను మార్చాలని ప్రతిపాదించింది. సముద్రంలో నాచు పెంపకంతో ఇక్కడ భారీగా ఆదాయం రాబట్టవచ్చని తెలిపింది. కోనసీమలో కోకోనట్ రీసెర్చ్ స్టేషన్ సామర్థ్యం పెంచాలని సూచించింది.

పెట్టుబడులతో రండి!

- కాకినాడలో నాఫ్తాకాంప్లెక్స్, పాలిమర్స్ యూనిట్ ఏర్పాటు చేయండి
- ఎల్‌జీ కెమికల్స్ కంపెనీతో చర్చించిన సీఎం
- షిప్ క్రూయిజ్ సర్వీసులపై కోర్దెలియాతో సంప్రదింపులు

కాకినాడలో నాఫ్తా కాంప్లెక్స్ పాలిమర్స్ కంపెనీ ఏర్పాటుచేయడానికి ముందుకు రావాలని ఎల్‌జీ కెమికల్స్ కంపెనీని సీఎం చంద్రబాబు కోరారు. రెండో రోజు విశాఖలో పెట్టుబడుల సదస్సులో భాగంగా సీఎం ఎల్‌జీ కెమికల్స్ కంపెనీతో చర్చలు జరిపారు. యు.కొత్తపల్లి మండలం మూలపేటలో ఈ రెండింటిని ఏర్పాటు చేసే విషయమై పరిశీలించాలని కోరారు. ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే అందుకు తగ్గ సహాయసహకారాలు అందిస్తామని వివరించారు. జేఎస్‌డబ్ల్యూ కంపెనీతో కలిసి ఎల్జీ కెమికల్ సంస్థ ఏర్పాటు చేయదలచిన కాథోడ్ యాక్టివ్ మెటీరియల్ తయారీ యూనిట్‌కు సైతం సహకారం అందిస్తామని పేర్కొన్నారు. వాస్తవానికి అనేక రకాల పరిశ్రమలు నిర్వహించడానికి ఇంధనంగా గ్యాస్ అవసరం. అది అందుబాటులో లేనప్పుడు నాఫ్తాతోను పరిశ్రమలను నడిపించవచ్చు. ఒకవేళ ఎల్‌జీ కంపెనీ నాఫ్తా కాంప్లెక్స్ ఏర్పాటుకు సానుకూలంగా స్పందిస్తే రూ.60వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అంచనా. కొరియా దేశానికి చెందిన ఎల్‌జీ కెమికల్స్‌కు పలు దేశాల్లో ఇప్పటికే నాఫ్తా కాంప్లెక్స్‌లు ఉన్నాయి. మరోపక్క దేశంలో ముంబై, గోవా తదితర ప్రాంతాల్లో సముద్రంలో షిప్ క్రూయిజ్ నిర్వహణలో ప్రఖ్యాతి గాంచిన కోర్దెలియా క్రూయిజ్ కంపెనీ ప్రతినిధులతో సీఎం చర్చలు జరిపారు. కాకినాడ నుంచి విశాఖ-భీమిలికి షిప్ క్రూయిజ్ సర్వీసులు నడపడానికి కలిసిరావాలని కోరారు. కాకినాడ, విశాఖల్లో క్రూయిజ్ టెర్మినల్ సౌకర్యాలు, బీచ్ టూరిజం, వాటర్ అడ్వంచర్ క్రీడల నిర్వహణపై ఆసక్తి చూపుతోంది.

రేపు రాజమహేంద్రవరానికి మంత్రి లోకేశ్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం సాయంత్రం రాజమహేంద్రవరం రానున్నట్టు పార్టీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు తెలిపారు. లోకేశ్ సోమవారం సాయంత్రం అయిదు గంటలకు రాజమహేంద్రవరంలోని చెరుకూరి కళ్యాణ మండపానికి చేరుకుని, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నేతృత్వంలో జరిగే అర్బన్ టీడీపీ సమావేశంలో పాల్గొంటారన్నారు. 18న ఉదయం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో అధికారిక ప్రారంభోత్సవాల కార్యక్రమాల్లోను, మధ్యాహ్నం నన్నయ యూనివర్సిటీలో జరిగే కార్యక్రమంలోను పాల్గొంటారన్నారు. సాయంత్రం తిరిగి విజయవాడ ప్రయాణవుతారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులకు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే మద్దిపాటి 8

సత్యదేవుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు
- ఒక్కరోజే సుమారు 12 వేల వ్రతాలు 8

జిల్లాలో రూర్బన్ పంచాయతీలు 31

- రాజమహేంద్రవరం డివిజన్‌లో 20
- కొవ్వూరు డివిజన్‌లో 11
- కార్పొరేషన్‌లో విలీనమయ్యే వాటిని కూడా ప్రతిపాదించారు
- వాటి సంగతేంటో..
- మొత్తం పంచాయతీలు 299
- ఇక పీడీవోలుగా సెక్రటరీలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఏడాదికి రూ.కోటి కంటే ఎక్కువ ఆదాయం ఉండే పంచాయతీలను రూర్బన్ పంచాయతీలుగా మార్చారు. అయితే గెజిట్‌లో వీటిని ప్రకటించవలసి ఉంది. ఈ నవంబరు నెలలోనే అధికారిక ప్రకటన రావొచ్చు. జిల్లాలో మొత్తం 299 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో రాజమహేంద్రవరం డివిజన్‌లో 20, కొవ్వూరు డివిజన్‌లో 11 పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా అంటే, రూర్బన్ పంచాయతీలుగా ప్రతిపాదించారు. ప్రభుత్వం రూ.కోటి ఆదాయం దాటిన అన్నింటిని ప్రతిపాదించమని చెప్పడంతో జిల్లాలో రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో అనపర్తి, బలభద్రపురం, బిక్కవోలు, గోకవరం, వేమగిరి, కడియపులంక, కడియం, కోరుకొండ, దివాన్‌చెరువు, పాలచర్ల, రంగంపేట, కోలమూరు, ధవళేశ్వరం, హుకుంపేట, బొమ్మూరు, పిడింగొయ్యి, కాతేరు, రాజవోలు, శాటిలైట్‌సిటీ, కొవ్వూరు డివిజన్ పరిధిలో చాగల్లు, దేవరపల్లి, గోపాలపురం, పంగిడి, నల్లజర్ల, పోతవరం, సమిశ్రగూడెం, ఐండవల్లి, పాలంగి, వేలివెన్ను, ఉండ్రాజవరం గ్రామ పంచాయతీలను ప్రతిపాదించారు. కానీ వీటిలో కొన్ని మాత్రమే అనుమతి పొందే అవకాశం ఉంది. ముఖ్యంగా రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిధిని గ్రామాలను మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విలీన ప్రక్రియ ఉంది. కానీ ఇక్కడ వాటిని కూడా రూర్బన్ పంచాయతీలుగా అధికారులు ప్రతిపాదించారు. విలీన ప్రక్రియకు లేకపోతే అవి రూర్బన్ పంచాయతీలుగా ఉండే అవకాశం ఉంది. రాజమహేంద్రవరం నగరాన్ని మహానగరంగా తీర్చిదిద్దే నేపథ్యంలో ఈ గ్రామాలన్నీ విలీనం అవ్వాలనే ఆలోచన కూడా ఉంది. వీటితోపాటు రాజానగరం మండలంలోని కొన్ని పంచాయతీలు, కోరుకొండ మండలంలోని కొన్ని పంచాయతీలు, కడియం మండలంలోని వేమగిరితో కలిపి మహానగరం చేస్తే, చారిత్రక నగరం మరింత అభివృద్ధి దిశగా పయనిస్తుంది. వీటిపై ఇంకా స్పష్టత రావలసి ఉంది.

పంచాయతీల ప్రక్షాళన...

గ్రామ పంచాయతీల విధానాన్ని ప్రభుత్వం ప్రక్షాళన చేసింది. ప్రతీ గ్రామం ఒక పంచాయతీగా ఉంటుంది. గతంలో రెండు మూడు పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌గా పిలిచేవారు. ఇక ఏ పంచాయతీకి ఆ పంచాయతీనే ప్రత్యేక గుర్తింపుతో ఉంటుంది. అంతేకాక పంచాయతీ సెక్రటరీలను ఇక నుంచి పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (పీడీవో)లుగా మార్చిన సంగతి తెలిసిందే. అంతేకాక గ్రామ పంచాయతీల జనాభా, ఆదాయాన్ని అనుసరించి నాలుగు కేటగిరీలుగా విభజించారు. పెద్ద పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలు (రూర్బన్ పంచాయతీ)లుగా మార్చి, తర్వాత ఆదాయాన్ని జనాభాను బట్టి గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 పంచాయతీలుగా వర్గీకరించారు. జిల్లాలో మొత్తం 299 పంచాయతీలు ఉండగా, అందులో 26 పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ (రూర్బన్) పంచాయతీలుగా గుర్తించారు. ఇవి గ్రామీణ, అర్బన్ ప్రాంతాల రెండింటి పోలికలతో ఉంటాయి. వీటికి డిప్యూటీ ఎంపీడీవో స్థాయి అధికారి ఉంటారు. మున్సిపాల్టీలు, నగర పంచాయతీల మాదిరిగా ఇక్కడ కూడా ప్రణాళిక, ఇంజనీరింగ్, వాటర్ సప్లయ్, శానిటేషన్, రెవెన్యూ వంటి విభాగాలు ఉంటాయి. అందుకే వీటిని రూర్బన్ పంచాయతీలు అంటారు. ఇవి పట్టణాలుగా రూపొందుతున్న పంచాయతీలు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 6,24,412 మంది జనాభా ఉన్నారు. 2021 లెక్కల ప్రకారం రాజమహేంద్రవరం డివిజన్‌లో కడియం, రంగంపేట, రాజానగరం, సీతానగరం, గోకవరం, బిక్కవోలు, అనపర్తి, కోరుకొండ, రాజమండ్రి రూరల్ మండలాల పరిధిలోని పంచాయతీల పరిధిలో 7,49,122 మంది జనాభా ఉన్నారు. ఈ మండలాల పరిధిలోని ఏడాది ఆదాయం రూ.60,82,89,533. ఈ లెక్కల ప్రకారం వాస్తవానికి జిల్లా నుంచి రాజమహేంద్రవరం డివిజన్ నుంచి జిల్లా యంత్రాంగం 20 పంచాయతీలను స్పెషల్ గ్రేడ్‌గానూ, 42 గ్రేడ్-1గానూ, 64 గ్రేడ్-2గానూ, 21 గ్రేడ్-3గానూ ప్రతిపాదించారు. ఈ డివిజన్‌లో మొత్తం 246 పంచాయతీలు ఉన్నాయి. కొవ్వూరు డివిజన్‌లో జనాభా 6,24,412 మంది. ఇక ఈ డివిజన్‌లోని పంచాయతీల వార్షికాదాయం రూ.30,97,60,376. వీటి ఆధారంగా జిల్లా అధికారులు ఈ డివిజన్ నుంచి 11 స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగానూ, 48 గ్రేడ్-1గానూ, 55 గ్రేడ్-2గానూ, 39 గ్రేడ్-3గానూ గుర్తించి ప్రతిపాదించారు. ఈ డివిజన్‌లో మొత్తం 153 పంచాయతీలు ఉన్నాయి. ఇలా జిల్లాలో మొత్తం 299 పంచాయతీలు ఉండగా వీటి జనాభా మొత్తం. 13 లక్షల,73వేల534మంది. ఈ పంచాయతీల మొత్తం వార్షికాదాయం రూ.91,80,49,908. ఈ లెక్కల ప్రకారం స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా 31, గ్రేడ్-1 పంచాయతీలుగా 89, గ్రేడ్-2 పంచాయతీలుగా 119, గ్రేడ్-3 పంచాయతీలుగా 60ను విభజించి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. కానీ వీటిలో కొన్ని మార్పులు జరుగుతున్నట్టు సమాచారం. త్వరలో స్పష్టత రానుంది.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం : జేసీ

దివాన్‌చెరువు, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులపై నిత్య ఒత్తిడిని తగ్గించేందుకు, వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపేందుకు కార్తీక వనసమారాధన ఎంతో దోహదం చేస్తుందని జేసీ వై.మేఘస్వరూప్ అన్నారు. లాలాచెరువు సమీపంలోని గోదావరి మహాపుష్కర వనంలో జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా అధికారుల కార్తీక వనమహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి హాజరైన జాయింట్ కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ అన్ని విభాగాల అధికార్లు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనడం ఆనందదాయకమని తెలిపారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జేసీ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా అటవీ అధికారి వి.ప్రభాకరరావు మాట్లాడుతూ అటవీశాఖ అధికార్లు, సిబ్బంది కృషి ఫలితంగానే ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు. తొలుత ఉసిరిచెట్టు కింద పూజలు చేశారు. అనంతరం జేసీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, జిల్లా గృహనిర్మాణ సంస్థ పీడీ నాతిబుజ్జి, కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ ఎస్.భాస్కర్‌రెడ్డి, సీపీవో ఎల్.అప్పలకొండ, జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.మాధవరావు, జిల్లా అధికారిణిలుఎస్.సుభాషిణి, వి.శాంతామణి, పి.వీణాదేవి పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న జాయింట్ కలెక్టర్ మేఘస్వరూప్


నృత్య ప్రదర్శనలు



అలరించిన గిరిజన నృత్య ప్రదర్శనలు

ముగిసిన భగవాన్ బిర్సాముండా 150వ జయంతి ఉత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్ నవంబరు 15(ఆంధ్రజ్యోతి): భగవాన్ బిర్సాముండా 150 జయంతి వేడుకలు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందరేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జాయింట్ కలెక్టర్ మేఘస్వరూప్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులు, బాలికల వసతి గృహం-1,2 విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి, గిరిజన సంప్రదాయ నృత్యాలు, గీతాలు, కళారూపాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో భాగంగా 15 రోజులపాటు వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వ్యక్తిత్వ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం పీఎంఎస్ బాలికల వసతిగృహం-2 విద్యార్థినుల మా గూడెం దింసా నృత్యం, బొమ్మూరు గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల చెంచుబుడ్డి, తూర్పుకొండల సూర్యుడు అంటూ ఆలపించిన పాటలు, రాజమహేంద్రవరం పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతి గృహం విద్యార్థినుల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల గిరిజన సంప్రదాయ వస్త్రధారణలతో ఫ్యాషన్‌షో, ర్యాంప్‌వాక్ కార్యక్రమాలు శ్రోతలను అమితంగా అలరించాయి. గిరిజన విద్యార్థినుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద వేదికగా నిలుస్తున్నాయని ఎంపీ పురందరేశ్వరి పేర్కొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే మద్దిపాటి



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

గోపాలపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ముఖ్యమంత్రి చంద్రబాబును శుక్రవారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా సీఎం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు తీసుకురావడం కోసం రేయింబ వళ్లు శ్రమిస్తూ బిజీ బిజీగా ఉన్నప్పటికీ ఆరాధ్య దైవమైన సీఎం కలిసి ఆశీస్సులు పొందే అవకాశం కల్పిం చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం హయాంలో ఎమ్మెల్యేగా నియోజక వర్గ ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నియోజక వర్గంలో తన పరిస్థితి గుర్తించి అటూ అభివృద్ధిలోనూ, ఇటూ సం క్షేమంలోనూ అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ నిధులు కేటాయిస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా బంగారుపాపమ్మ తల్లి ఉత్సవాలు ప్రారంభం



సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు

తాళ్లపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించి గ్రామ దేవతల ఉత్సవాలు సక్రమంగా జరిగేలా కమిటీలు బాధ్యత తీసుకోవాలని, అటువంటి సందర్భాలలో ఎటువంటి వివాదాలు ఎదురవ్వవని అడిషనల్ ఎస్పీ అల్లూరి సుబ్బరాజు అన్నారు. శనివారం అన్న దేవరపేటలో ప్రారంభమైన బంగారు పాపమ్మ తల్లి ఉత్సవాలను పరిశీలించేందుకు విచ్చేశారు. అనంతరం కమిటీ సభ్యులతో మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ నిఘా ఉంచామని తెలిపారు. తహశీల్దార్ లక్ష్మీలావణ్య తన సిబ్బందితో వచ్చి ఏర్పాట్లను పరిశీలించి అమ్మవారిని దర్శించుకున్నారు.

వెంకటేశ్వరరావు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, ఇతరులు

దేవరపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ గ్రామ టీడీపీ అధ్యక్షుడు జ్యేష్ట వెంకటేశ్వరరావు మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దేవరపల్లిలో శనివారం ఇటీవల మృతి చెందిన వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. దీనిలో భాగంగా వెంకటేశ్వరరావు సోదరుడు సత్యనారాయణను, కుటుంబ సభ్యుడు పిచ్చుకల గోవిందరావు పరామర్శించారు. ఈయనతోపాటు టీడీపీ మండల అధ్యక్షుడు ఆంద్రూ అనిల్, సొసైటీ అధ్యక్షుడు పెనుమత్స సుబ్బరాజు, ఉప్పులూరి రామారావు, గన్నమని హరికృష్ణ, మాజీ టీడీపీ మండల అధ్యక్షుడు సుంకర దుర్గారావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు గద్దే సుబ్రహ్మణ్యం, కరుటూరి శ్రీనివాస్, కాట్రు భీమరాజు, ఓరుగంటి లక్ష్మీపతిరాజు, యాగంటి సాయిబాబు, యాగంటి సుబ్రహ్మణ్యం, అంబటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వైజాగ్ సీఐఐ సదస్సులో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు

● టీడీపీ సీనియర్ నేత రాజీవ్‌కృష్ణ



మంత్రి నారా లోకేష్, తదితరులతో రాజీవ్‌కృష్ణ

రాజమహేంద్రవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వైజాగ్‌లో జరిగిన సీఐఐ పెట్టుబడి సదస్సులో రూ.10వేల కోట్ల కొత్త పెట్టుబడులు రానున్నాయని టీడీపీ సీనియర్ నేత, ప్రముఖ పారిశ్రామిక వేత్త ఎస్. రాజీవ్‌కృష్ణ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ నాయకత్వంలో ఇది సాధ్యమవుతుందన్నారు. తాను కూడా ఈ సదస్సులో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు.

పారదర్శకంగా రేషన్ పంపిణీ

కొవ్వూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను పారదర్శకంగా పంపిణీ చేయాలని ఆర్డీవో రాణీసుస్మిత అన్నారు. శనివారం దొమ్మేరు రేషన్ షాపులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా స్టాక్, రికార్డులు, బయోమెట్రిక్ హాజరు, నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ 65 సంవత్సరాలు దాటిన వృద్ధులు, వికలాంగులకు రేషన్ సరుకులను తప్పనిసరిగా ఇంటి వద్దనే అందించాలన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానం పెంపొందించుకోవచ్చు

● డిప్యూటీ ఎంపీడీవో ప్రకాశరావు, ఎంఈవో - 2 రామకిషోర్ ● కొనసాగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



కొవ్వూరు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్న అధికారులు



నిడదవోలులో పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

కొవ్వూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు శాఖా గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని డ్రగ్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో బీవీఎస్ఎన్‌కేఎస్ఎస్ ప్రకాశరావు, ఎంఈవో - 2 రామకిషోర్ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పుస్తక పఠనం చేయడం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో సినీ గేయ రచయిత మానాశ్రీ, గ్రంథాలయ అధికారి కె.సుగుణ కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

నిడదవోలు: గ్రంథాలయాల్లో ఉన్న విలువైన పుస్తక సంపద విద్యార్థులు, యువతకు వరమని ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ పచ్చిపలుసు శ్రీరామారావు అన్నారు. శనివారం పట్టణంలోని నందిన సుబ్బారావు లీలావతి శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా 2వ రోజు గ్రంథాలయ ఆవశ్యకతను తెలియచేస్తూ పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీరామారావు మాట్లాడుతూ గ్రంథాలయాలలో ఉన్న పుస్తక సంపద విద్యార్థులను ఉన్నత విద్యావంతులు గాను తీర్చిదిద్దుతుందన్నారు. అనంతరం నిర్వహించిన పుస్తక ప్రదర్శనను విద్యార్థులు తిలకించారు. కార్యక్రమంలో సుంకవల్లి శ్రీధర్, పోన్నా కృష్ణబాబు, సానెపు వెంకట సుబ్బారావు, యల్లపు పైడియ్య, కుందుల ప్రభాకరం, గ్రంథాలయ అధికారి గద్దె శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా తీపర్రు, పెరవలి, ముక్కామల గ్రంథాలయాల్లో శనివారం పుస్తక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా తీపర్రులో ఎంఈవో షేక్ సూర్జహాన్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గ్రంథాలయాన్ని వినియోగించుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని పేర్కొన్నారు. గ్రంధి రామచంద్రరావు, బోగపల్లి నాగేశ్వరరావు, ప్రత్తిపాటి ప్రసాద్‌కుమార్, గ్రంథాలయ అధికారి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. ముక్కామల గ్రంథాలయంలో యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ఫణీంద్ర, పీహెచ్‌సీ వైద్యుడు వెంకటపతి, కడియాల సాయిరామారావు, కరుటూరి విశ్వనాథం, నల్ల సత్యనారాయణ, గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నల్లజర్ల: పుస్తకాలు చదవటం వల్ల తల ఎత్తుకుని జీవించే అవకాశం ఉంటుందని నల్లజర్ల శాఖ గ్రంథాలయ నిర్వాహకురాలు రమణ పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా 2వ రోజు శనివారం గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, చెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విభిన్న రంగాల్లో రాణించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుదే సుశీల, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చదరంగం పోటీలు నిర్వహించినట్టు గ్రంథాలయాధికారి వీ.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు భాష్యం స్కూల్, హర్షవర్ధన్ స్కూల్, సత్యసాయి స్కూల్, చైతన్య స్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు 80 మంది వరకు పాల్గొన్నారని తెలిపారు. న్యాయనిర్ణేతలుగా డీ.రాజు, ఎస్.మణి, ఆర్. జగదీష్, బీ. శ్యామ్, గడ్డం చిరంజీవి, లక్ష్మణ్ వ్యవహరించారు.

తాళ్లపూడి: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. దీన్ని శాఖ గౌరవ అధ్యక్షుడు గుండు బోగుల ఆదినారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు టీచర్లు పాల్గొని మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారినరేష్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.



తీపర్రులో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం



నల్లజర్లలో విద్యార్థులకు పుస్తక పఠనం ఏర్పాటు చేసిన దృశ్యం



దేవరపల్లి గ్రంథాలయంలో చదరంగం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎంపీ పురందేశ్వరికి ఆహ్వానం



ఆహ్వానపత్రికను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పురపాలక సంఘ డైమండ్ జూబ్లీ ఉత్సవాలలో పాల్గొనాలంటూ శనివారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరికి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం జరిగే 5కే రన్ అండ్ వాక్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నేత పిక్కి నాగేంద్ర, ప్రమోద్ కుమార్, మద్దిపాటి ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బీహార్ గెలుపుతో బీజేపీ సంబరాలు



చెరుకుమిల్లిలో కేకును కోసిన బీజేపీ నేతలు

గోపాలపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిక్సూచీలాంటి వారని బీజేపీ మండల అధ్యక్షుడు పిల్లి వెంకటేశ్వరరావు అన్నారు. బీహార్ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించిన సందర్భంగా శనివారం చెరుకుమిల్లిలో బీజేపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేకును కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

శివ, కేశవులుగా గోలింగేశ్వరుడు

బిక్కవోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం బహుళ ఏకాదశి సందర్భంగా శనివారం బిక్కవోలులోని ప్రాచీన గోలింగేశ్వరుడు శివ-కేశవులుగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, లక్ష బిల్వార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



యర్నగూడెంలో వ్రతాలు చేస్తున్న దృశ్యం

దేవరపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): యర్నగూడెంలో అలివేలుమంగ పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త శ్రీకాకుళపు కాశీవిశ్వనాథం, రోహిణి దంపతుల ఆధ్వర్యంలో 108 మంది దంపతులు వ్రతంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి కార్తీకమాసం శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివార్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళపు వెంకట నరసింహమూర్తి, శ్రీకాకుళపు కాశీకృష్ణ, తీగల బలరామయ్య, బళ్లా సూర్యచక్రం, పోతుల బలరామకృష్ణ, బళ్లా రవి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రీ వెరిఫికేషన్

కొవ్వూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో నమోదైన గంజాయిని రీ వెరిఫికేషన్ చేసినట్టు జిల్లా అదనపు ఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. కొవ్వూరు సబ్ డివిజనల్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో 34 కేసులలో పట్టుబడిన గంజాయి కేసుల్లో సీజ్ చేసిన 4274 కేజీల గంజాయిని రీ వెరిఫికేషన్ చేశారు. జిల్లా డ్రగ్ డిస్పోజబుల్ కమిటీ ఆధ్వర్యంలో వివిధ కేసులలో సీజ్ చేసిన గంజాయిని తూకం వేసి పరిశీలించారు. జిల్లా ఎస్పీ అధ్యక్షుడిగా, అదనపు ఎస్పీ మురళీకృష్ణ, నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ సభ్యులుగా కేసులో పట్టబడిన గంజాయిని డిస్పోజబుల్ చేశారు. కొవ్వూరు డీఎస్పీ జీ.దేవకుమార్, సీఐలు పి.విశ్వం, కె.విజయ్‌బాబు పాల్గొన్నారు.

న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

కొవ్వూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక గవర్నమెంట్ హైస్కూల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భావన రత్నకుమారి, కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, టీపీవో టీ.మణిరామ్, ఏఈ సుమంత్, ఆర్ఐ డీ. శ్యామ్, కౌన్సిలర్ రాము, కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఏఈ సుమంత్, వేమగిరి వెంకట్రావు, పెనుమాక జయరాజు, సతీష్, న్యాయవాదులు హరీష్, పీవీపీ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు



కొవ్వూరు డివిజన్ పరిధిలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత



వడ్లూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



నల్లజర్లలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ

కొవ్వూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత అన్నారు.శనివారం పట్టణంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాల్టీ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత చేపట్టారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: పారిశుధ్య కార్యక్రమాలు అమలుకు ప్రజలు సహకరించాలని తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర .. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వడ్లూరులో పారిశుధ్య కార్యక్రమాల అమలుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటా చెత్త సేకరణ చేసే సమయంలో పారిశుధ్య కార్మికులకు ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో కె. ఆంజనేయశర్మ మాట్లాడుతూ పంచాయతీ ద్వారా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తున్నారని చెప్పారు. ప్రజలు చెత్తచెదారాలను రోడ్ల పక్క వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్. తేజశ్రీ, శానిటేషన్ మండల కోఆర్డినేటర్ కత్తుల ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శి టీ.రాజ్‌కుమార్, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు.

నల్లజర్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర లక్ష్యమని ఎంపీడీవో సత్యనా రాయణ అన్నారు. శనివారం నల్లజర్ల హైస్కూల్‌లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అలాగే తరగతి గదులు, పాఠశాల ఆవరణను శుభ్రపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, ఈవోపీఆర్‌డీ సింహాద్రిరావు, హెచ్ఎం కోమలి చిత్ర, పంచాయతీ కార్యదర్శి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: వేగేశ్వరపురంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రతినెలా 3వ శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా నవంబరు నెలకు సంబంధించి వ్యక్తిగత, సమాజ పరిశుభ్రత అనే కార్యక్రమాన్ని నిర్వహించినట్టు సర్పంచ్ కె. పరశురామారావు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, పంచాయతీ సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి సీతారాముల కల్యాణానికి

గోటి తలంబ్రాల సేకరణ



గోటి తలంబ్రాలకు ధాన్యాన్ని సేకరిస్తున్న భక్తులు

తాళ్లపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి రామయ్య కల్యాణానికి అవసరమయ్యే తలంబ్రాలకు ధాన్యం సేకరణ శనివారం మండలంలోని రావూరుపాడుకి చెందిన రేకపల్లి సత్యనారాయణ దంపతులు తమ పొలంలో పండించిన పంట నుంచి అవసరమయ్యే ధాన్యాన్ని సేకరించారు. మలకపల్లికి చెందిన సత్యనారాయణ రావూరుపాడులో మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో చేతులతో కోసిన వరి కంకులను సేకరించి రామ భక్తుల గోటితో వలిపించిన బియ్యాన్ని భద్రాచలంలోని సీతారాముల కల్యాణానికి తలంబ్రాలుగా వాడేందుకు తీసుకువెళుతున్నామన్నారు. సేకరించిన ధాన్యాన్ని పలు గ్రామాల్లోని శ్రీరామ భక్త బృందాలకు అందచేసి వారు గోటితో వలిచిన బియ్యమంతా ఒకచోటకి చేర్చి కాలినడకన భద్రాచలంలో శ్రీరామనవమికి భద్రాద్రికి చేరుస్తున్నామన్నారు. 19 మందితో ప్రారంభమైన కార్యక్రమం నేడు 10 వేల మంది బృందంగా మారిందన్నారు. మూడు జిల్లాలకు చెందిన భక్తులు ఈ కార్యక్రమంలో భాగస్వాములుగా ఉన్నామన్నారు. కరుటూరి అమరావతి, జీ. ప్రసాద్, బలుసు ప్రసాద్, బలుసు సత్యనారాయణ, అరిగె సోమరాజు, కోశారు గోపాలకృష్ణ, వెంకటరెడ్డి మహిళా భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సత్యదేవుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు



అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

» ఒక్కరోజే సుమారు 12 వేల వ్రతాలు

» లక్ష మార్కు దాటిన స్వామివారి కార్తీకం వ్రతాలు

అన్నవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం సత్యదేవుడి సన్నిధికి కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా శనివారం భక్తులు పోటెత్తారు. ఈ ఏడాది కార్తీకమాసంలో తొలిసారి 10వేల మార్కుదాటి 11,647 వ్రతాలు ఒక్కరోజే జరగడం విశేషం. దీంతో శనివారంతో సత్యదేవుడి కార్తీకమాస వ్రతాల సంఖ్య 1,15,086కు చేరింది. కార్తీకం ముగియడానికి నాలుగరోజులు సమయం ఉండగా 1,35,000 జరగవచ్చనని అంచనా వేస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఒంటి గంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. సత్యదేవుడి అంతరాలయ దర్శన టిక్కెట్ల విక్రయాలు పూర్తిగా నిలుపుదల చేశారు. యంత్రాలయ దర్శనం నిలుపుదల చేసి లఘుదర్శనానికి పరిమితం చే శారు. స్వామివారి ప్రత్యేక దర్శనం వ్రతాలకు సుమారు నాలుగు గంటల సమయం పట్టడంతో ఉప వాసంతో వ్రతం చేసుకున్న భక్తులు అవస్థలు ఎదు ర్కొన్నారు. చైర్మన్ రోహిత్ పశ్చిమ రాజగోపురం వద్ద లిఫ్ట్ సమీపంలో ఉండి రద్దీని నియంత్రణ చేశారు.మరోపక్క వాహనాల పార్కింగ్‌కు స్థలాభావం ఏర్పడడంతో పోలీసులు కొండ దిగువన మైదానంలో వాహనాలను నిలుపుదల చేశారు.నిత్యాన్నదాన ట్రస్ట్ ద్వారా భక్తులకు ఉచిత పులిహోర వితరణ చేశారు. మరో పక్క శనివారం రాత్రికి వివాహాలు ఉండ డంతో సత్రం గదుల కేటాయింపు కష్టంగా మారింది.

తుని ఎమ్మెల్యే పూజలు

సత్యదేవుడి సన్నిధిని తుని ఎమ్మెల్యే యనమల దివ్య కుటుంబ సభ్యులతో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా చైర్మన్ రోహిత్ వారికి స్వామివారి మెమెంటో, ప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గంటా విష్ణు తదితరులున్నారు.

రాజమండ్రి అభివృద్ధికి కృషి : ఎంపీ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి తన పరిధిలో కృషి చేస్తున్నానని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. త్వరలో జరగబోయే గోదావరి పుష్కరాల పనులపై శాఖలవారీ సమీక్ష చేయాల్సి ఉందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పుష్కరాలను ఘనంగా నిర్వహించడానికి కార్యాచరణ రూపొందిస్తున్నాయని పేర్కొన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజమండ్రి పెద్ద రైల్వేస్టేషన్‌కు రూ.270 కోట్లు నిధులు తెచ్చామని, పుష్కరాల్లోగా పనులు పూర్తి చేయడానికి వీలుగా ప్లాట్‌ఫారమ్స్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, స్టేషన్‌కు ఇరువైపులా అభివృద్ధి పనులు కోసం మూడు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలవాలని రైల్వేమంత్రితో మాట్లాడానని అన్నారు. కొవ్వూరులో రెండు రైళ్లకు, అనపర్తిలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు హాల్టు తెచ్చామన్నారు. పొగాకు రైతుల సమస్యను దృష్టిలో పెట్టుకుని వారితో సమావేశమయ్యేందుకు ఈనెల 28, 29 తేదీల్లో కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ఇక్కడకు వస్తున్నారన్నారు. మోరంపూడి ఫ్లై ఓవర్ వద్ద లైట్లు, సర్వీసు రోడ్ల నిర్మాణంపై కేంద్ర మంత్రి గడ్కరీతో మాట్లాడామన్నారు. మొంథా తుఫాను వల్ల నష్టపోయిన పంటలపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. అనకాపల్లి-దివాన్‌చెరువు ఎన్‌హెచ్ 16 ఆరులేన్ల రహదారిగా అభివృద్ధి చేస్తున్నారని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చునని మున్సిపల్ ఛైర్‌పర్సన్ రత్నకుమారి అన్నారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని యానాదికాలనీలో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ రత్నకుమారి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. కానీ ప్రజలు, వ్యాపారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, టీపీవో టి.మణిరామ్, ఏఈ సుమంత్, మున్సిపల్ మేనేజర్ భరత్, ఆర్ఐ డీ.శ్యామ్, భరత్, శానిటరీ ఇన్‌చార్జి రవి, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.